

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 260 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 16, ఆగస్టు 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# అవార్డు గ్రహీతలకు.. అభినందలు



**డాక్టర్ బరిగెల శివ**

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



ఉద్యోగ ధర్మాన్ని ఊపిరిలా భావించారు

ఉద్యోగ కర్తవ్యాన్ని స్థాయికి మించి నిర్వర్తించారు

సమాజానికి గొప్ప చేయాలనే ఆలోచన ఉద్యోగుల్లో అరుదు

ప్రభుత్వ వ్యవస్థలను స్థాయికి మించి కాపాడుకుంటున్నారు

ఉపాధి సంపాదన కన్నా ఉద్యోగ ధర్మానికి ప్రాధాన్యతనిస్తున్నారు

అరుదైన గౌరవాలకు అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులు

సంవత్సర కాలం పాటు క్రమశిక్షణకు కొదువ లేకుండా ఉద్యోగం చేశారు

పనితనంలో కనపరచిన నిజాయితీకి దక్కిన ఫలితాలు

నేటి దినాల్లో ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకోవడం మామూలు విషయం కాదు

ప్రభుత్వ వ్యవస్థలు గర్విస్తున్నాయి అవార్డు గ్రహీతలు మెరిసిపోతున్నారు : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

ప్రభుత్వ ఉద్యోగులు అవార్డులు పొందుకొని గర్విస్తున్న దినాన్ని ముమ్మాటికి అభినందించాల్సిందేనని డాక్టర్ బరిగెల శివ కొనియాడారు.ప్రతి ఏటా భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు,అధికారులకు ఉద్యోగ ధర్మంలో అత్యున్నత ప్రతిభను కనబరిచిన ప్రభుత్వ ఉద్యోగులందరిని ఉత్తమ ఉద్యోగ అవార్డుల గ్రహీతలను చేయడం గొప్ప విశేషంగా భావించాలన్నారు.తోటి ఉద్యోగులతో పాటు పై అధికారులు ప్రభుత్వ పెద్దల చేతుల మీదుగా సగౌరవంగా అవార్డులు అందుకొని సమాజంలో చక్కని పేరును సంపాదించి పెట్టుకుంటున్నారన్నారు.సంవత్సర కాలం పాటు ఉద్యోగ ధర్మంలో అలుపెరుగని విధులు నిర్వహిస్తుండగా క్రమశిక్షణను నిజాయితీని అవినీతిరహిత ప్రభుత్వ ఉద్యోగ ధర్మాన్ని కొనసాగించి మెరుగైన ఉద్యోగ సేవలు అందించినందువల్ల ఉత్తమ అవార్డులకు ఎన్నిక చేయబడ్డారన్నారు.నేటి దినాల్లో ఉత్తమ ఉద్యోగి అవార్డులు అందుకోవడం చాలా

- మిగతా 3లో..



# రాష్ట్ర అభివృద్ధికి రాజమార్గాలు

దేశానికి ఆదర్శంగా నిలపడమే ప్రధాన లక్ష్యం

తెలంగాణ అన్ని రంగాల్లో బలపడుతుంది

అభివృద్ధి లక్ష్యంగా ముందుకు నడుస్తున్నాం

కష్టాలను ఛేదిస్తూ పాలించడం మామూలు విషయం కాదు

వెనుకబడిన తెలంగాణను ముందుకు నడిపిస్తున్నాం

అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీటవేస్తూ సమన్యాయం చేస్తున్నాం

తెలంగాణ ఐక్యతను కాపాడడంలో ప్రభుత్వం ముందు చూపుతో ఉంది

హైడ్రా అద్భుతాలు దేశవ్యాప్తంగా పేరు గడిస్తున్నాయి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి



2

## రాజ్‌భవన్ ఎట్‌హోమ్‌కు సిఎం రేవంత్ హాజరు

హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇచ్చిన తేనీటి విందుకు సీఎం రేవంత్‌రెడ్డి , డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు- పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన వారి వద్దకు గవర్నర్, సీఎం వెళ్లి పలకరించారు. ఏటా స్వాంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇలా కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## రాహుల్‌కు కనీస అవగాహన లేదు

ఓట్ల చోరీ జరిగితే బిజెపి సీట్లు ఎందుకు తగ్గుతాయి

ఇండియా కూటమి సీట్లు ఎలా పెరిగాయి

తెలంగాణ, కర్నాటకలో కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది

కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు

7

## దొంగ ఓట్లపై రాహుల్ రాజీలేని పోరాటం

గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో మహేశ్ కుమార్ గౌడ్

3



## రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపిన దేవాదాయ శాఖ మంత్రి సురేఖ

హైదరాబాద్, (జై భీమ్ న్యూస్)



రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణభగవానుని జన్మదినం హిందువులకు పర్వదినమన్నారు. గోకులాష్టమిగా, ఉట్ల పండుగగా ప్రజలు జరుపుకునే శ్రీ కృష్ణుని జన్మదినానికి పురాణ ఇతిహాసాల్లో ప్రత్యేకత ఉందన్నారు. భారతీయ హిందూ ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ జీవన విధానంలో శ్రీకృష్ణుని తాత్వికత అత్యంత ప్రత్యేకమైనదని, ప్రభావశీలమైందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేశ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా భగవాన్ శ్రీకృష్ణుని దీవెనలు అందాలని మంత్రి సురేఖ ప్రార్థించారు.

## దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు

అభినందనలు తెలిపిన అమెరికా,రష్యా తదితర దేశాలు

3

# రాష్ట్ర అభివృద్ధికి రాజమార్గాలు

**దేశానికి ఆదర్శంగా నిలపడమే ప్రధాన లక్ష్యం**
**తెలంగాణ అన్ని రంగాల్లో బలపడుతుంది**
**అభివృద్ధి లక్ష్యంగా ముందుకు నడుస్తున్నాం**
**కష్టాలను ఛేదిస్తూ పాలించడం మామూలు విషయం కాదు**
**వెనుకబడిన తెలంగాణను ముందుకు నడిపిస్తున్నాం**
**అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీటవేస్తూ సమన్యాయం చేస్తున్నాం**
**తెలంగాణ ఐక్యతను కాపాడడంలో ప్రభుత్వం ముందు చూపుతో ఉంది**
**హైడ్రా అద్భుతాలు దేశవ్యాప్తంగా పేరు గడిస్తున్నాయి**
**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ జై భీమ్ డెస్క్:

రాష్ట్రానికి ఉన్న ఆర్థిక భారాన్ని అధిగమించి ప్రపంచ వేదికపై తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టే వరకు విశ్రమించబోమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "మనసుంటే మార్గం ఉంటుందన్న సూక్తిని బలంగా విశ్వసిస్తాను. మాకు సంకల్పం ఉంది. అందుకు అవసరమైన విజన్ ఉంది. ఆర్థిక భారం ఉన్నప్పటికీ శూన్యం నుంచి ఉన్నత శిఖరానికి రాష్ట్రాన్ని తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నాం. ప్రజల అండతో లక్ష్యం చేరుకునే వరకు విశ్రమించం.." అని గోల్కొండ వేదికగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గోల్కొండ రాణిమహల్ లాన్స్‌లో ముఖ్యమంత్రి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తెలంగాణ రాష్ట్ర గీతాలాపన, సమ్మాన్ గార్డ్స్ కవాతు అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి గారు ప్రసంగించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోజు నుంచి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు తెలంగాణ సమగ్రాభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికను ఆవిష్కరించారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలన్న లక్ష్య సాధన కోసం పనిచేద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం. ప్రజలు, ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకున్నాం. రైతులు, మహిళలు, యువత భవితకు పెద్దపీట వేశాం. సామాజిక తెలంగాణ ఆవిష్కరణకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. కుల గణనతో బలహీన వర్గాల వందేళ్ల కలను నిజం చేశాం. ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల నిరీక్షణకు తెరదించాం. అభివృద్ధి, సంక్షేమం అన్న ద్విముఖ విధానంతో ప్రభుత్వం పాలన సాగిస్తోంది. అందరినీ కలుపుకుని అద్భుతాలు సృష్టించే సమ్మిళిత అభివృద్ధి విధానాన్ని ప్రజా ప్రభుత్వం ఎంచుకుంది. పరిపాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ 20 నెలల కాలంలో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలబెట్టాం.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి 8,21,651 కోట్ల అప్పులు, బకాయిలు ఉండగా, అందులో 6,71,757 కోట్ల అప్పు.. ఉద్యోగులు, ఇతర పథకాలకు సంబంధించిన బకాయిలు 40,154 కోట్లు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, సింగరేణి, విద్యుత్, ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు 1,09,740 కోట్లు ఉండగా, వాటిపై అసలు రూపేణా 1,32,498 కోట్లు, వడ్డీ రూపేణా 88,178 కోట్లు మొత్తం కలిపి 2,20,676 కోట్ల రూపాయల డెట్ సర్వీసింగ్ చేసాం. పేద ప్రజల ఆహార భద్రతకు భరోసాగా ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించాం. 13 వేల కోట్ల రూపాయల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేపట్టాం. నిరుపేదల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే పథకంతో పేదల కళ్లలో కనిపించిన ఆనందం, ఆత్మగౌరవం శాశ్వతంగా గుర్తుంటుంది. అలాగే ఈ ఏడాది జూలై నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం. వరంగల్ వేదికగా 2022 మే 6 న ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు 20,616 కోట్ల రూపాయల రుణమాఫీ చేసి కొత్త చరిత్ర సృష్టించాం. రైతుల విషయంలో ప్రభుత్వం రాజీ పడదు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 12 వేల చొప్పున జూన్ 16 న కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించాం. దేశంలోనే అత్యధిక పంట పండించే దిశగా తెలంగాణ రైతాంగాన్ని ప్రోత్సహించాం. రాష్ట్ర వ్యాప్తంగా 7,178 కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేశాం. సన్నాలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం. రాష్ట్రంలో 29 లక్షల పంపుసెట్లకు 16,691 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇవన్నీ రైతుల పట్ల, వ్యవసాయం పట్ల ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యవసాయ చరిత్రను తిరగరాసి అన్నదాతల సంక్షేమానికి రూ. 1 లక్ష 13 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశాం.పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం 22,500 కోట్లను వెచ్చిస్తున్నాం. ఎంతో శ్రమకోర్చి శాస్త్రీయమైన, ఎంతో లోతైన కసరత్తు చేసి సామాజిక తెలంగాణ సాధన కోసం స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ద్వారా ఆమోదించాం. ఆ బిల్లులను కేంద్ర ప్రభుత్వం సత్వరం ఆమోదించాలని కోరుతున్నాం. అలాగే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం. సామాజిక తెలంగాణకు పునాది వేసిన రోజు ఫిబ్రవరి 4వ తేదీని తెలంగాణ సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని నిర్ణయించాం. రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం కోటి మంది కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అత్యంత పారదర్శకతతో, వివాదరహితంగా వివిధ పరీక్షలు నిర్వహించి 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. ప్రైవేటు రంగంలో లక్షలాది ఉద్యోగ అవకాశాలను కల్పించాం. యువత మాదక ద్రవ్యాల భారిన పడి జీవితాలను నాశనం చేసుకోకుండా వాటిని కఠినంగా అణిచి వేస్తున్నాం. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే ప్రణాళికలతో ప్రాజెక్టులకు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళుతున్నాం. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాల సాధనలో రాజీ పడబోం. హైదరాబాద్‌లో హైడ్రాను ఏర్పాటు చేసిన తర్వాత 13 పార్కులను, 20 చెరువులను ఆక్రమణల నుంచి రక్షించింది. 30 వేల కోట్ల విలువ కలిగిన ప్రభుత్వ భూములను కాపాడగలిగింది. తెలంగాణ బలం హైదరాబాద్. ఆ బలాన్ని మరింత బ్రాండింగ్ చేయడానికి పలు అంతర్జాతీయ ఈవెంట్లను నిర్వహించాం. మిస్ వరల్డ్, వరల్డ్ గ్లోబల్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సదస్సు, గ్లోబల్ రైస్ సమ్మిట్, బయో ఏషియా సదస్సు వంటివి నిర్వహించాం. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా మార్చుకుంటున్నాం.శాంతి భద్రతలు రాష్ట్ర ప్రగతికి కీలక పాత్ర పోషిస్తాయి. తెలంగాణ అనేక అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలిచి అత్యంత ప్రశాంత నగరంగా గుర్తింపు పొందుతుందంటే అందుకు మన పోలీసు వ్యవస్థ కారణం. వారికి అభినందనలు. తెలంగాణ పోలీసులకు దేశంలోనే ది బెస్ట్ అనే పేరుంది. అన్ని వేదికల నుంచి తెలంగాణ విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేశాం. తెలంగాణ రైజింగ్ 2047 (తెలంగాణ రైసింగ్ 2047) విజన్ డాక్యుమెంట్‌ను ఈ ఏడాది డిసెంబర్ లో ఆవిష్కరించబోతున్నాం. దేశ స్వాతంత్ర్యం సిద్ధించి శత వసంతాలు పూర్తి చేసుకుంటున్న 2047 నాటికి తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలబెట్టాలన్న విజన్‌తో నిరంతరం శ్రమిస్తున్నాం. భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్నదే మా సంకల్పం. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు నుంచి తెలంగాణ గ్రామీణ వ్యవసాయ వికాసం వరకు విజన్‌లో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించాం. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టు, మెట్రో విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డును కలిపే రేడియల్ రోడ్లు, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు వంటి లక్ష్యాలతో తెలంగాణ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చే ప్రణాళికే తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్. తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలు పోషించే పాత్ర అద్వితీయంగా ఉంటుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు దేశ విద్యా రంగంలో గేమ్ ఛేంజర్లు కావడం ఖాయం. శూన్యం నుంచి దేశ ప్రయాణం మొదలైంది. ఉన్నత శిఖరాలే లక్ష్యంగా మన పెద్దలు ఈ దేశాన్ని ముందుకు నడిపించారు. ఈరోజు మనం చూస్తున్న ఆధునిక భారతం వెనుక 79 ఏళ్ల కఠోర శ్రమ, ఎందరో గొప్ప నాయకుల త్యాగం, చెమట, రక్తం ఉంది. ఈ విజయ ప్రస్థానంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ మనం రుణపడి ఉండాలి. వారందించిన విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం మనందరి కర్తవ్యం. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో, ఆ స్ఫూర్తితో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు, డీజీపీ జితేందర్ గారితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ కు ఈ సందర్భంగా 1 కోటి రూపాయల ప్రోత్సహక చెక్కును ముఖ్యమంత్రి అందించారు.

# వరంగల్-ఖమ్మం హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

**సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రెడ్డి - వెంటనే స్పందించిన కాంగ్రెస్ నాయకత్వం**

రాయపర్తి (జై భీమ్ న్యూస్)

రాయపర్తి మండలం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రాయపర్తి మండలం మోరిపిరాల క్రాస్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను, ప్రయాణికులను కలవరపరిచింది. ఆర్టీసీ బస్సు మరియు లారీ ఒకదానితో ఒకటి ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం సంభవించిన వెంటనే అక్కడున్న ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు.. సంఘటన విషయం తెలిసిన వెంటనే పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి వేగంగా స్పందించారు. రాయపర్తి మండల పోలీసు అధికారులకు ఫోన్ చేసి, తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే సమయంలో, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఫోన్ చేసి, గాయపడిన బాధితులను ఆసుపత్రులకు తరలించడంలో సహాయం చేయాలని సూచించారు.. తరువాత స్వయంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. బస్సులో చిక్కుకున్న గాయపడిన ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీయడానికి అక్కడున్న పోలీసులు, స్థానికులు కలిసి కృషి చేశారు..గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం సేకరించిన ఎమ్మెల్యే, వెంటనే వరంగల్ ఎంజిఎమ్ ఆసుపత్రి సూపరింటెండెంట్, వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. గాయపడిన వారికి అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు, అవసరమైతే అదనంగా 108



అంబులెన్స్ వాహనాలను సమకూర్చాలని ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. "ప్రజల ప్రాణాలు అత్యంత ప్రాధాన్యం. ఎక్కడ ప్రమాదం జరిగినా, ఎప్పుడు జరిగినా, తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు సహాయం చేయడం ప్రజా ప్రతినిధుల కర్తవ్యం. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని అని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, వైద్య సిబ్బంది, పోలీసులు అందరూ కలసి గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. బాధిత కుటుంబాలు, స్థానికులు ఈ వేగవంతమైన స్పందనకు ఎమ్మెల్యే మరియు ఝాన్సి రాజేందర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనతో మోరిపిరాల క్రాస్ పరిసర ప్రాంతం కొంతసేపు రవాణా అంతరాయం ఎదుర్కొంది.అనంతరం పోలీసులు వాహనాలను తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించారు..

**వన మహోత్సవంలో భాగంగా ఈత,ఖర్జూర మొక్కల నాటకం..**

పాలకుర్తి నియోజకవర్గంలోని రాయపర్తి మండలం తిరుమలాయపల్లి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గౌడన్న కులవృత్తి అభివృద్ధికి చేయూతనిస్తూ గ్రామ చెరువు కట్ట వద్ద ఈత మరియు ఖర్జూర మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట సిఐ స్వరూప,ఎస్సై సరిత, ఎస్సై గంగాధర్ గౌడ్ తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మెరుగు రమేష్ గౌడ్,ఉపాధ్యక్షుడు మండల మధుకర్ గౌడ్, భజన శంకరయ్య గౌడ్,తాళ్లపల్లి నారాయణ గౌడ్,కేజీకేస్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బాలగోని రాంబాబు, బండి కొమరయ్య తదితరులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయ వృత్తుల పునరుద్ధరణకు ఈ రకం కార్యక్రమాలు తోడ్పడతాయని పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం

**10లక్షల చెక్కును పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం**



చింతకాని మండలం(జై భీమ్ న్యూస్)

చిన్నమండవ గ్రామంలో గత నెల క్రితం ఒకే కుటుంబానికి చెందిన కాసిమాల నాగగోపి, నంద కిషోర్ ఇద్దరు అన్నదమ్ములు మున్నేరు పడి చనిపోవడం జరిగింది.. తెలంగాణ ప్రభుత్వం స్పంది చి ఆ కుటుంబానికి అండగా ఉండాలని 10 లక్షల చెక్కును ఖమ్మం పరేడ్ గ్రౌండ్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క , జిల్లా కలెక్టర్ అనుదీప్ గారి చేతుల మీదగా కాసిమాల వెంకట్ , సుభద్రకు చెక్కు ను అందజేయడం జరిగింది.. కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి , వైరా ఎమ్మెల్యే రాందస్ నాయక్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మడిపల్లి భాస్కరరావు, కన్నబోయిన సీతారామయ్య, గుండ్ల రాంబాబు, అంగిడి హరిక్రిష్ణ అవ్వల నాగేశ్వరరావు, పాషా పర్చగాని వెంకటరాములు, మరిదు రామకృష్ణ, పర్చగని తిరుపతి (డీలర్), పర్చగని సతీష్, మోచర్ల చంద్రశేఖర్, నిమ్మ తోట ముత్తయ్య పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వశపాక ఎల్లయ్య



రాయపర్తి (జై భీమ్ న్యూస్)

79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎస్సీ కాలనీలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మరియు కాంగ్రెస్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వశపాక ఎల్లయ్య పతాక ఆవిష్కరణలి చేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడులి ముద్రబోయిన వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాశం నరోత్తం రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు మచ్చలి కుమారస్వామి, వశపాక యాకయ్య, వశపాక గోలయ్య, అంబేద్కర్ యువజన సంఘం యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరలక్ష్మి వ్రతం



పాలకుర్తి (జై భీమ్ న్యూస్)

పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వ్రతంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. పుష్పాలు, దీపాలతో అలంకరించిన మంగళ వేదికపై వరలక్ష్మి అమ్మవారికి పూజారి మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు,హారతులు నిర్వహించారు.మహిళలు సంప్రదాయబద్ధంగా అలంకరించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ "ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించాను" అన్నారు. ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ "వరలక్ష్మి వ్రతం స్త్రీ శక్తి, ఐక్యతకు ప్రతీక" అని తెలిపారు. వ్రతం అనంతరం మహిళలకు తాంబూలాలు,ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,మహిళా సంఘ సభ్యులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జిఎస్టీ మోసంలో వ్యాపారి అరెస్ట్

హైదరాబాద్,ఆగస్ట్15(జై భీమ్ న్యూస్) :

జీఎస్టీ మోసం బయటపడింది. ఈ కేసులో అంబికా స్టీల్ మేనేజ్‌మెంట్ పార్టనర్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సరుకుల వాస్తవ రవాణా లేకుండా ఈ-వే బిల్లులు సృష్టించినట్టు- నిర్ధరణ అయింది. నకిలీ ఇన్‌వాయిస్‌లు జారీ చేసి తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్టు- గుర్తించారు. ఈమేరకు రాష్ట్ర జీఎస్టీ అధికారుల ఫిర్యాదుతో ఈ ఏడాది జులై 30న అంబికా స్టీల్ మేనేజింగ్ పార్టనర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. గోవాకు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నట్టు- పోలీసులు తెలిపారు.

# సంపాదకీయం

## ప్రకృతి ప్రకోపానికి బలవ్వాల్సిందేనా !

క్లౌడ్ బరస్ట్ ..ఈ మధ్య కొత్తగా వింటున్నదేమీ కాదు. క్యుములో నింబస్ మేఘాలు ఉరుము ఉరిమినట్లుగా కురియడంతో ఒకేచోట కుండపోత వానగా వస్తోంది. ఉమ్మడి ఎపిలో ఈ క్యుములో నింబస్ మేఘాల వల్లనే అప్పటి సిఎం రాజశేర్ రెడ్డితో పాటు, అయన పరివారం మృత్యువాత పడింది. ఇదంతా కేవలం ప్రకృతి విధ్వంసం వల్ల జరుగుతున్న విపరిణామంగా చూడాలి. మనం నిత్యం కొండలను గుట్టలను కొట్టేస్తున్నాం. అడవులను నరికేస్తున్నాం. కాశ్మీర్ ,ఉత్తరాఖండ్, కేరళ, హిమాచల్, ఎపి, తెలంగాణ ఇలా రాష్ట్రం ఏదైనా ప్రకృతిని నాశనం చేయడం వల్లనే ఉత్పాతాలు జరుగుతున్నాయి. వాటినుంచి మనం గుణపాఠం నేర్చుకోవడం లేదు. అడ్డుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఈక్రమంలో తాజాగా జమ్ముకశ్మీర్ కొండల్లో ఆకస్మిక వరదల కారణంగా 60 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి గాయాల పాలయ్యారు. జమ్మూలో గురువారం మేఘ విస్ఫోటం విరుచుకుపడింది. ఫలితంగా మచైల్ మాతా దేవి దర్శనానికి వెళ్తున్న యాత్రికులు బలయ్యారు. ఒక్కసారిగా వచ్చి పడిన ఆకస్మిక వరదతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది గల్లంతయ్యారు. పలు భవనాలు, దుకాణాలు తుడిచిపెట్టుకుపోయాయి. వరదల కారణంగా తీవ్ర విషాదం నెలకొనడంతో మచైల్ మాతా దేవి యాత్రను నిలిపివేశారు. ఇకపోతే ఉత్తరాఖండ్‌లో ఖీర్‌గంగా నది మెరుపు వరదతో ధరాలీ పట్టణంపై విరుచుకుపడిన తీరును కూడా చూశాం. ఎగువ ప్రాంతాల్లో జరిగిన క్లౌడ్ బరస్ట్ కారణంగా అనూహ్య స్థాయిలో భారీ వరద చోటుచేసుకుంది. వరద ధాటికి ధరాలీ పట్టణంలోని దాదాపు సగభాగం కొట్టుకుపోయింది. కొన్ని అడుగుల మేర పేరుకుపోయిన బురద తప్ప అక్కడ ఉన్నట్టి ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు వంటివి ఏవీ ప్రస్తుతం కనిపించడం లేదు. వరద ధాటికి మూడు నాలుగు అంతస్తుల భవనాలు పేకమేడల్లా కూలిపోయాయని, యాత్రికుల కోసం నిర్మించిన 20-25 హోటళ్లు, పలు హోం స్టేలు ప్రస్తుతం కనపడటం లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అధికారిక సమాచారం ప్రకారం 40 నుండి 50 ఇళ్లు కొట్టుకుపోయాయి. ఐదుగురు మరణించారు. ఉత్పాతం చోటు-చేసుకున్న సమయంలో పర్యాటకులు ఎవరైనా ధరాలీలో ఉన్నారా ఉంటే వారి పరిస్థితి ఏమిటి? అన్న దానితో పాటు-, స్థానికులందరూ క్షేమంగా ఉన్నారా అన్న అంశంపై కూడా స్పష్టత రావడం లేదు. దుర్ఘటన జరిగిన వెంటనే సమీపంలోని హర్సిల్‌లో ఉన్న సైనిక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. ఆ సైనిక క్యాంపునకు చెందిన వారే 10 మంది వరద ధాటికి గల్లంతు కావడం గమనార్హం. మిగిలిన సైన్యం తమ శక్తి మేరకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. క్లౌడ్ బరస్ట్ కారణంగా రహదారులు ధ్వంసం కావడం, నిరవధికంగా కురుస్తున్న వర్షంతో హెలికాప్టర్ ప్రయాణానికి వాతావరణం అనుకూలించకపోవడం వంటి పరిస్థితులు దాపురిస్తున్నాయి. దుర్ఘటన జరిగిన తరువాత కూడా ఆ ప్రాంతంలో అధిక వర్షపాతం కురవడం కానీ, క్లౌడ్ బరస్ట్ వంటి ఉత్పాతాలు చోటు చేసుకోవడం చూస్తున్నాం. ఖీర్‌గంగ ఇలా ఉప్పొంగడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కాలంలో 2018లో, 2021లో కూడా ఈ నదికి భారీగా వరదలు వచ్చి, తీవ్ర నష్టం వాటిల్లింది. 1835లో అతి పెద్ద వరద ఈ నదికి వచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పటి మాదిరే బురద వరద అప్పుడు కూడా ధరాలీని ముంచెత్తిందని, దాంతో అప్పటి పట్టణం పూర్తిగా ధ్వంసం అయిందని చెబుతున్నారు. ఆ శిధిలాలపైన ప్రస్తుత పట్టణం నిర్మాణ మైంది. ధరాలీకి ఎగువన ఖీర్ గంగా ప్రవాహాన్ని ఆనుకుని పెద్ద గడ్డిమైదానాలు, కొండలు, పాతకాలపు హిమాని నది శిధిలాలు ఉండటంతో వరదలు వచ్చిన ప్రతిసారీ బురద వెల్లువెత్తుతోందని జిల్లా అధికార యంత్రాంగం నిర్ధారించింది. మరోవైపు అభివృద్ధి పేరుతో పెద్దఎత్తున సాగుతున్న అడవుల విధ్వంసం కూడా ఉత్తరాఖండ్‌లో కొనసాగుతోంది. ఒక్క గత సంవత్సరంలోనే 998 హెక్టార్లలోని అటవీ ప్రాంతం నష్టపోయినట్లు అధికారిక నివేది వెల్లడించింది. 2021-24 మధ్య అటవీ ప్రాంతాల్లో 41 శాతం చెట్లను కోల్పోయినట్లు తాజాగా విడుదలైన ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. విచ్చలవిడిగా సాగుతున్న ఈ తరహా విధ్వంసం కూడా ప్రకృతి ప్రళయాలకు కారణమౌతోంది. అదే విధంగా ఖీర్‌గంగా పొడవునా రక్షిత గోడ నిర్మించాలని స్థానిక ప్రజలు కొన్ని సంవత్స రాలుగా కోరుతున్నారు. అధికార యంత్రాంగం ఈ విషయాలపై దృష్టి సారిస్తే స్థానిక ప్రజలకు కొంత మేర ఊరట లభిస్తుంది.ఉమ్మడి ఎపిలోనూ వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వర్షం నీరు వస్తే పోయే దారులను ఆక్రమించి ఇళ్లు కట్టుకుంటున్నాం. దీంతో ఆకస్మిక వరదలు వస్తున్నాయి. మొన్నటికి మొన్న వరంగల్‌లో మరోమారు వర్షబీభత్సం సృష్టిం చింది. ఖమ్మంలో జోరుగా వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో రోడ్లు చెరువులను తలపి స్తున్నాయి. చెరువులను మాయం చేసిన పాపానికి ఇలా తయ్యారయ్యింది. ఇకపోతే మూసీ ఆక్రమణల కారణంగా హైదరాబాద్‌లో మూసీ ఉధృతంగా ప్రవహించింది. పురానాపూల్ శ్మశాన వాటిక మునిగి పోయింది. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ఉమ్మడి ఎపిలో పలు ప్రాంతాలు మళ్లీ వరదలకు గురవుతున్నాయి. వివిధ జిల్లాల్లో చిన్నా పెద్దా జలపాతాలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పుడు మనం చూస్తున్న వరదలు, వానలు సకాలంలో కురవక పోవడం, క్లౌడ్ బరస్ట్‌లు అన్నీ కూడా ప్రకృతి విధ్వంసానికి నిదర్శనాలు. పాలకులు వీటిపట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ప్రజల్లో కూడా చైతన్యం రావడం లేదు. అందుకే వీటి విధ్వంసానికి మనం బలవ్వాల్సిందే.

## ఎందరో త్యాగమూర్తుల పోరాటమే స్వాతంత్ర్యం: బాలకృష్ణ

**హిందూపురం,ఆగస్టు15(జై భీమ్ న్యూస్):**



హిందూపురం లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం ఈరోజు ఊపిరి పీల్చుకుంటున్నామంటే ఎంతోమంది త్యాగమూర్తుల ఫలితమే మనకి స్వాతంత్ర్యం వచ్చింది అన్నారు.. ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం.. అందులో పూజారిగా మాత్రమే నేను వ్యవహరిస్తాను. గతంలో మా నాన్న ఎన్టీఆర్ ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తాను. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాను అన్నారు. ఇక, హిందూపురాన్ని అభివృద్ధి చేస్తాము. ఈ నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించమని కేంద్ర మంత్రులతో మాట్లాడడం జరిగిందని ఆయన అన్నారు. అటు- సినిమా రంగంలోనూ, రాజకీయంగానూ ప్రజల ఆశీస్సులు తనకు శ్రీరామరక్ష అని బాలకృష్ణ అన్నారు.

# అవార్డు గ్రహీతలకు అభినందనలు

మొదటి పేజీ తరువాయి

అరుదన్నారు.కష్టపడిన ఉద్యోగులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం గౌరవించడం గొప్పతనంగా భావించాలన్నారు.ఏ ఉద్యోగి కైనా ఉత్తమ అవార్డులు పొందుకోవడం ఆయా ఉద్యోగులపై ఉద్యోగ ధర్మాన్ని ఉద్యోగ గౌరవాన్ని మరింత పెంపొందిస్తున్నాయన్నారు. చిన్న పెద్ద అనే భేదం లేకుండా కష్టపడ్డ ఉద్యోగు లందరు గొప్పోల్లుగా గ్రహించబడి అవార్డులు పొందుకోవడం ఉద్యోగ ధర్మంలో మరుపురానిదన్నారు. వృత్తి ధర్మంలో ఉద్యోగులకు ఉద్యోగులే పోటీ తత్వకులుగా మారిపోయి కష్టపడి అవార్డులు సంపాదించుకున్నారన్నారు.రాష్ట్ర ఉద్యోగులను రాజ మర్యాదలతో గౌరవించి అవార్డులు ప్రకటించిన ప్రభుత్వాన్ని అభినందించాలన్నారు. పైరవీలకు అవకాశం లేకుండా వృత్తిపరంగా ప్రభుత్వ వ్యవస్థల పరంగా నిర్విరామమైన కృషిచేసి ఉద్యోగంలో అత్యధిక ప్రాధాన్యతను కనపరిచిన ఉద్యోగులకు మాత్రమే అన్ని ప్రభుత్వ శాఖలలో అవార్డులు కల్పించబడడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరుకు అద్దం పట్టినట్టుగా ఉందన్నారు.సమకాలీన రాజకీయాలలో సాహసవంతమైన పనితీరుకు సమానులైన ఉద్యోగులకు అవార్డులు లభించడం గొప్పతనంగా భావించాలన్నారు. అవార్డులు పొందుకోలేని ఉద్యోగులు అధికారులు కూడా బేశుగ్గా పనిచేయగల సమర్థులేనన్నారు. చేతినిండా పని కల్పించుకుని కష్టబోతుల్లా పనిచేస్తున్న ఉద్యోగులను ఎప్పటికప్పుడు గౌరవించుకోవడం ప్రభుత్వాల బాధ్యతగా భావించాలన్నారు.అందరూ ఒకే రకంగా ఉద్యోగ ధర్మంలో పనిచేయడం సాధ్యం కానప్పటికీ నేటి దినాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవ చేయడం లేదనే భావన ప్రజల్లో ఎక్కువగా పెరిగిపోయిందన్నారు.ఉన్నత అధికారుల పనితీరు ప్రజాసేవకు సరైన రీతిలో అందుబాటులో ఉండటం లేదనే భావన ప్రజల్లో కల్పించబడిందన్నారు.అలాంటి మనోభావాలను చేదిస్తూ, నెట్టుకుంటూ,ప్రభుత్వ ఉద్యోగులపై కల్పించబడిన వ్యతిరేకతను దూరం చేస్తూ ఉద్యోగ విధి నిర్వహణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేయగల ఉద్యోగులు ఇంకా ఉన్నారని నేడు అవార్డులు పొందుకున్న ఉద్యోగులను చూస్తే అదే రకమైన సంకల్పం బలపరచబడుతుందన్నారు.అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ ఆస్తులు సంపాదించుకుంటున్న కొంతమంది ఉద్యోగులను భరిస్తున్న ప్రభుత్వ వ్యవస్థలు ఇలాంటి గౌరవప్రదమైన ఉద్యోగ ధర్మాన్ని కొనసాగిస్తూ సమాజం పట్ల ప్రభుత్వం పట్ల ప్రభుత్వ వ్యవస్థల పట్ల ఎక్కడలేని గౌరవాన్ని పొందుకుంటున్న ఉద్యోగులను చూసి మిగతా ఉద్యోగులు మిగతా అధికారులు అదే రకమైన పనితీరును కొనసాగించుటకు కృతనిచ్ఛ్యులై ఉండాలన్నారు.ఉత్తమ ఉద్యోగ అవార్డులు ఉద్యోగుల బాధ్యతను పెంచుతుండడంతోపాటు సమాజం పట్ల గౌరవాలను పెంచగలవన్నారు.ఒక రకంగా చెప్పాలంటే రాజకీయ నాయకులు సైతం ఈర్ష పడే విధంగా అవార్డులు ప్రకటించిన నేతలు అధికారులు రాష్ట్ర ప్రభుత్వంచే అభినందించబడే విధంగా ప్రభుత్వం ప్రభుత్వ వ్యవస్థలు ఒక్కసారిగా గౌరవ మర్యాదలు పెంపొందించుకున్నాయన్నారు.స్వాతంత్ర్య దినోత్సవం రోజున అవార్డులు పొందుకోవడం ఉద్యోగులకు గొప్ప అనుభూతిగా భావించాలన్నారు.అత్యుత్తమ స్థాయిలో ప్రభుత్వ ప్రధాన నేతలు అన్ని శాఖల ప్రభుత్వ ఉన్నత అధికారులు దేశ ఔన్నత్యాన్ని దేశ గొప్పతనాన్ని దేశ గౌరవాన్ని స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రసంగాల రూపంలో ప్రస్తావిస్తూనే అవార్డులకు ఎన్నికైన ఉద్యోగులను ఆయాసభలపై గౌరవిస్తున్న సందర్భాలను ప్రత్యక్షంగా చూస్తుండడం అత్యద్భుతంగా ఉద్యోగ బాధ్యతలు అభివృద్ధి జరుగుతున్నట్లుగా ఉంటుందన్నారు.జాతీయ జెండాకు గౌరవాన్ని తెచ్చి పెడుతున్న ఉద్యోగులను పక్కాగా అభినందించాల్సిందేనని ఘంటాపదంగా చెప్పారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి ఐన పేద ప్రజలకు చేసిన సేవ ఆయా ఉద్యోగుల జీవితాలలో పది కాలాలపాటు పదిలంగా నిలిచిపోగలదని అభివర్ణించారు.సమాజంలో ఒక్కసారిగా గౌరవ మర్యాదలు పెంచుకున్న అవార్డు గ్రహీతలైన ఉద్యోగులను మరొక్కసారి అభినందిస్తూ ఉద్యోగ ధర్మంలో ఉద్యోగ విధి నిర్వహణలో ఇలాంటి అవార్డులు మరెన్నో పొందుకోవాలని వెనుతిరిగి చూడకుండా ముందుచూపుతో దూర దృష్టితో సమాజ భాగుకొరకు ప్రభుత్వ వ్యవస్థల బలోపేతం కొరకు ఉద్యోగ ధర్మాన్ని కొనసాగిస్తూ ఉద్యోగ వ్యవస్థలలో నీతి నిజాయితీ నియమాలను క్రమశిక్షణను పాటిస్తూ ప్రభుత్వ వ్యవస్థలను కాపాడే బాధ్యతలను మీరే తీసుకోవాలని మరొక్కసారి అభినందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా అవార్డులకు ఎన్నికైన ఉద్యోగుల అంకితభావం భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వీర యోధులకు అంకితం ఇవ్వాలని సూచించారు.మీలాంటి ఉద్యోగుల వల్లే సమాజంలో ప్రభుత్వ వ్యవస్థలకు గౌరవ మర్యాదలు ఉన్న పాటుగా పెరిగిపోతాయన్నారు.

## దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు

### అభినందనలు తెలిపిన అమెరికా,రష్యా తదితర దేశాలు

**న్యూఢిల్లీఆగస్టు15(జై భీమ్ న్యూస్) :**

దేశ 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీలో ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుక కోసం ఎర్రకోట పరిసరాల్లో 11 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. 'నయా భారత్ ఇతివృత్తంతోఈ స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించారు. భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా, సింగపూర్, మాల్దీవుల నుంచి సందేశాలు అందాయి. భారత్‌తో తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకొంటామని ఈ సందర్భంగా ఆయా దేశాధినేతలు, మంత్రులు పేర్కొన్నారు. తమ 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని సగర్వంగా నిర్వహించుకుంటున్న భారత ప్రజలకు అమెరికా ప్రజల తరఫున విదేశాంగ మంత్రి మార్కో రూబియో శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత్, ప్రపంచంలో పురాతన ప్రజాస్వామ్యమైన యూఎస్‌ల మధ్య చారిత్రాత్మక సంబంధం కొనసాగుతోందని పేర్కొన్నారు. భారత్, అమెరికా సంబంధాలు ఎంతో దృఢమైనవని, ఇరు దేశాలు మరింత శక్తివంతమైన ఒప్పందాలను చేసుకోవడం కోసం ఎదురు చూస్తున్నామని వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీ సామాజిక ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక ఇతర రంగాల్లో విజయాన్ని సాధిస్తూ.. వేగవంతంగా ముందుకు సాగుతోందని, ప్రపంచ వేదికపై తగిన గౌరవం పొందుతోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎజెండాలోని కీలక సమస్యలను పరిష్కరించడంతో చురుకుగా వ్యవహరిస్తోం దన్నారు. భారత్‌తో ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విలువైనదిగా భావిస్తున్నాం. మా ఉమ్మడి ప్రయత్నాల ద్వారా బహుళ రంగాల్లో నిర్మాణాత్మక, ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటు-న్నామని వివరించారు. భారత్‌కు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు. భారత్, ఇజ్రాయెల్ మధ్య ఉన్న స్నేహబంధం ఇలాగే కొనసాగాలని కోరుకుంటు-న్నట్టు- ఇజ్రాయెల్ ఎంబసీ ఒక ప్రకటనలో పేర్కొంది. మాల్దీవులకు న్యూఢిల్లీ ఎల్లప్పుడూ విశ్వసనీయ అభివృద్ధి భాగస్వామిగా ఉంటుందని, ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి సంబంధాలు మరింత ముందుకు వెళ్లాలని కాంక్షిస్తున్నట్టు- మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు ప్రకటించారు. భారత ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలను సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్ ప్రకటించారు. ఈ వారం ప్రారంభంలో న్యూఢిల్లీతో జరిపిన చర్చలు ఇరు దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేశాయని , మరిన్ని దౌత్యసంబంధాల కోసం ఎదురు చూస్తున్నామని ప్రకటించారు.

## ఇందిరమ్మ కాలని కడిపికొండలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు

**వరంగల్, (జై భీమ్ న్యూస్ ప్రతినిధి) :**

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ 44 వ డివిజన్ కడిపికొండ పరిధిలో ఇందిరమ్మ కాలనీ డెవలప్మెంట్ కమిటీ అధ్యర్యంలో ఏర్పాటు చేసిన స్వతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇందిరమ్మ కాలనీ డెవలప్మెంట్ కమిటి అధ్యక్షులు ర్యాకల సత్యం,44 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజారాపు స్వామి హాజరై జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం ర్యాకల సత్యం మాట్లాడుతూ మనకు స్వతంత్రము రావడానికి ఎంతోమంది ప్రాణ త్యాగాల ఫలితం అని అన్నారు. యువత చెడు దారిలో వెనకడుగు వేయాలి దేశ సేవలో ముందు అడుగు వేసేలా ఉండాలి అని అక్కడ హాజరైన యువకులకు సూచించారు.44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజరాపు స్వామి మాట్లాడుతూ ఆగస్టు పదిహేను అనేది మన సమిష్టి జ్ఞాపకాలలో నిలిచిపోయే రోజు అని అన్నారు.వలస పాలన నుండి విముక్తి పొందిన దినం. సుదీర్ఘ సంవత్సరాలలో భారతీయులు స్వాతంత్ర్య దినోత్సవం గురించి కలలు కన్నారు దాని సాధించిన గొప్ప ఫలితమే ఈ ఆగస్టు 15 అని అన్నారు. ఈ కార్యక్రమంలో బండ కనకసాయిలు, చీకట్ల సంపత్ గౌడ్,సిలువేరు కర్ణాకర్, కేతిరి రాజేందర్, గద్దె రాజేందర్ గౌడ్,అశోక్ గౌడ్,శంకర్ నాయక్,బండి దేవేందర్, సురేష్ నాయక్,చిరుత శ్రీను, నర్మేట చిన్న,బాచి శ్రీనురెడ్డి,బంగ్య నాయక్, మట్టెడ నరేష్,మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షురాలు బొబ్బిలి ప్రశాంతి గౌడ్, ఉపాధ్యక్షురాలు మందల నవ్య,తదితరులు పాల్గొన్నారు.



## దొంగ ఓట్లపై రాహుల్ రాజీలేని పోరాటం

### గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరణలో మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,ఆగస్టు15(జై భీమ్ న్యూస్):**

దొంగ ఓట్లపై రాహుల్ గాంధీ అలుపెరగని పోరాటం చేస్తున్నారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ- అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సింగిల్ బెడ్ రూం ఉన్న ఇంట్లో 45 మంది ఓటర్లా? అని విస్మయం వ్యక్తం చేశారు. ఓట్ల దొంగతనం జరిగిందని తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో నిరూపించారని ఆయన తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం గాంధీ భవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను పథకం ప్రకారం తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు కేంద్రానికి మొట్టికాయలు వేసిందన్నారు. మహారాష్ట్ర పార్లమెంటు- ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయిందో అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. పేదలకు సన్న బియ్యం ఇవ్వడం చారిత్రాత్మకమైన నిర్ణయం అని ఆయన అన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, దీంతో వారి కళ్ళలో కనిపిస్తున్న ఆనందం చూస్తే ఇందిరమ్మ పాలన గుర్తు వస్తున్నదని ఆయన తెలిపారు. కులగణన చేసి బిసి బిల్లు తీసుకుని రావడంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బిసిల పట్ల ఉన్న చిత్తశుద్ధి స్పష్టమైందన్నారు. కాంగ్రెస్, గాంధీ కుటుంబం లేకపోతే దేశానికి స్వాతంత్యం÷-ర రావడం అంత తేలికైన పనేమి కాదన్నారు. బ్రిటిష్ పాలకుల అడుగులకు మడుగులు వత్తారని, స్వాతంత్యం÷-ర వద్దు అని అన్నారని ఆయన బిజెపి నాయకులనుద్దేశించి విమర్శించారు. స్వాతంత్య్ర సమరయోధులను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి నాయకుడు, మాజీ ఎంపి వి. హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ రాజ్‌భవన్‌లో ఎట్‌హోమ్

**విజయవాడ,ఆగస్టు15(జై భీమ్ న్యూస్):**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఎట్ హోమ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు- ఆయన భార్య అన్నా లేజినోవా దంపతులు హాజరయ్యారు. అలాగే ఐటీ-, విద్య శాఖల మంత్రి నారా లోకేష్‌తోపాటు- పలువురు మంత్రులు పాల్గొన్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు- వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. అతిథుల వద్దకు స్వయంగా వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించారు.

## తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుమల: వారంతపు సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వైకుంఠ క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతుంది. వైకుంఠ క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోవడంతో భక్తులను ఆక్టోపస్ భవనం నుంచి తితిదే క్యూ లైన్లలోకి అనుమతిస్తోంది. స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తితిదే సిబ్బంది అన్నప్రసాదాలు, నీరు, పాలు అందిస్తున్నారు.

# “కే.యు అన్ని రంగాలతో పాటు అకాడమిక్ పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని వి.సి ప్రతాప్ రెడ్డి








**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

అన్ని రంగాలతో పాటు అకడమిక్ పరంగా కూడా కాకతీయ విశ్వవిద్యాలయం వేగంగా అభివృద్ధి చెందుతోంది” అని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. పరిపాలనా భవన ప్రాంగణంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్.సీ.సీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించిన ఆయన, జాతీయ నాయకుల చిత్రాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకల్లో పాలక మండలి సభ్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ, “అందుబాటులో ఉన్న మానవ, ఆర్థిక, భౌతిక వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. ఇది ఎంతో మంది ఆశయ సాధన కేంద్రమైంది. తెలంగాణ ఉద్యమంలో విశ్వవిద్యాలయం ప్రధాన పాత్ర పోషించింది” అని అన్నారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన టీజీ ఈ.డి.సెట్ %-% 2025 మరియు 23వ స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. రూస నిధులతో జాతీయ స్థాయి పరిశోధనలకు వసతులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఆచార్య ఎన్. ప్రసాద్, ఆచార్య ఎం. ఇస్తారి నేతృత్వంలో పరిశోధనల ద్వారా పేటెంట్లు నమోదైనట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాలకు హెచ్.ఎం. టీ. వి అవార్డు లభించిందని, ఒప్పంద అధ్యాపకులు డాక్టర్ టి. రాధిక, ఆచార్య పి. మల్లారెడ్డి, ఆచార్య పి. శ్రీనివాస్ రావు, ఆచార్య సి.జే. శ్రీలత, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం లాంటి అధ్యాపకులు ప్రతిష్టాత్మక అవార్డులను పొందారని గుర్తు చేశారు. కామర్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని మాచెర్ల కృష్ణవేణి 10వ ఆసియన్ టైక్వాండో చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిందని, ఎన్. ఎస్.ఎస్ వాలంటీర్ కృతిక ఉత్తమ వాలంటీర్‌గా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గుర్తింపు పొందిందని చెప్పారు. అలాగే, విశ్వవిద్యాలయ ఎన్.సీ.సీ క్యాడెట్ బి. ప్రశాంత్ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కావడం విశేషం అని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కాలేజీ లో, ఇతర విభాగ ల లో ప్రాంగణ నియామకాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ లోకి అడుగుపెడుతుండగా, త్వరలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ బి. రమ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ సుకుమారి, డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, బోధనేతర ఉద్యోగులు, విశ్రాంత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా బోధన, బోధనేతర, విశ్రాంత ఉద్యోగుల మధ్య నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా, ఆగస్టు-సెప్టెంబర్ నుండి విద్యార్థులు మరియు ఉద్యోగుల కోసం ఫేస్ రికగ్నిషన్ హాజరు వ్యవస్థ అమలు చేయనున్నట్లు వైస్ చాన్సలర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీ రాజు వల్లాల సంయోజకులుగా వ్యవహరించారు.

# ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







**హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**హనుమకొండ, జై భీమ్ న్యూస్**

79 వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హనుమకొండ జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం పరేడ్ వాహనంలో మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ లకు వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. జిల్లా ప్రజలకు, అధికారులకు, కవులు, కళాకారులకు మంత్రి సురేఖ 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర వివరాల నివేదికను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చదివారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు జాతీయ భావాన్ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. పలు దేశభక్తి గీతాలకు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాల్లో జిల్లా టాపర్లుగా నిలిచిన పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, కళాశాలల విద్యార్థులకు పదివేల చొప్పున ఎనిమిది మంది విద్యార్థులకు 80 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా విద్యాశాఖ అధికారులు అందజేశారు . విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం తో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఉత్తమ పనితీరుకుగాను ప్రశంసా పత్రాలను మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అందజేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళలు పిల్లలు దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ చేనేత- టెస్కో, వ్యవసాయ, గృహ నిర్మాణ, మత్స్య, జిల్లా వైద్య ఆరోగ్య, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందర్శించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు వ్యవసాయ పరికరాలను ప్రదర్శించగా మంత్రి, కలెక్టర్, సిపి, వాటిని తిలకించారు. మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన విదేశీ విద్య నిధి పథకం కింద ముగ్గురు విద్యార్థులకు విదేశీ విద్య, విమానయాన ఖర్చులు సహా రూ. 61.71 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ, అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఘనంగా స్వాగతం పలికారు. 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధులను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, డిసిపి షేక్ సలీమా, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, జిల్లాకు చెందిన పలువురు స్వాతంత్ర్య సమరయోధులు, కవులు, కళాకారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా అధికారులు, సిబ్బంది, చిన్నారులకు స్వీట్లను అందజేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, సురేష్ కుమార్ తో పాటు ఏసీపీలు, ఆర్.ఐ లు, ఇన్స్ స్పెక్టర్లు, పరిపాలన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



# ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**





**జై భీమ్ న్యూస్ హన్మకొండ**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, తదితర ఎంతోమంది దేశభక్తులు, మహనీయుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం సిద్ధించిందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ త్రివర్ణ పతాకాన్ని అదనపు కలెక్టర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వానికి, దేశాభివృద్ధికి, ఐక్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. జిల్లా ప్రజలకు, అధికార యంత్రంగానికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను జిల్లా అదనపు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, కలెక్టరేట్ ఏవో గౌరీ శంకర్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఈనెల 25వ తేదీలోగా స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**జై భీమ్ న్యూస్ హన్మకొండ**

హనుమకొండ జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేయనున్న తాత్కాలిక స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలోని భవనాలలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం ఎక్సలెన్స్ సెంటర్ లో స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న క్లాస్ రూమ్స్, ఎంతమందికి వసతి సదుపాయాలను కల్పిస్తున్నారనే వివరాలను జిల్లా యువజన క్రీడాధికారి గుగులోత్ అశోక్ కుమార్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణకు ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను పరిశీలించి ఎప్పటి వరకు పనులను పూర్తి చేస్తారని ఇంజనీరింగ్ అధికారులు, క్రీడల శాఖ అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణకు ఈనెల 25వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసి ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్పోర్ట్స్ స్కూల్ కు కావలసిన అన్ని ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఈ.ఈ సురేష్ బాబు, టీ.జీ.ఎస్డీ.సీ ఇంజనీరింగ్ అధికారులు నరేందర్ రెడ్డి, రవీందర్, కోచ్ లు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా



# 90 గ్రాముల గంజాయి, 400 గంజాయి చాక్లెట్లను పట్టివేత

**ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసి ఖమ్మం జైల్ కు తరలింపు**

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

ఈ నెల 14న రైల్వే పోలీస్ సిబ్బంది ఎం. అభినవ్, ఎస్ఐఆర్పి రైల్వే పోలీస్ కాజీపేట, ఆర్ రమణ రెడ్డి, జి హరి, డి ప్రభాకర్, జి. క్రాంతి కుమార్, జి.స్వాతి, ఎం. స్రవంతి, కాజీపేట రైల్వే స్టేషన్‌లో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ఒక పురుషుడు ఒక బ్యాగుతో ఉన్నట్లు గుర్తించారు. సంచులను తెరిచినప్పుడు 90 గ్రాముల గంజాయి, 400 గంజాయి చాక్లెట్లు, విలువ %=ం%.32,000/-. నిందితుడు రమేష్ కుమార్ దాస్ (38) తండ్రి బిద్యోధర్ దాస్ కహ్సోగోడియా గ్రామం, ఖిలిపియాంఖా, కొర్రై, జాజ్‌పూర్, ఒడిషా రాష్ట్రం అనే వ్యక్తి ఒడిశాలో గంజాయి మరియు గంజాయి చాక్లెట్‌లను కొనుగోలు చేసి సికింద్రాబాద్‌కు వెళ్లి అవసరమైన వారికి గంజాయి మరియు గంజాయి చాక్లెట్‌లను విక్రయించి సులభంగా డబ్బు సంపాదించానని అంగీకరించాడు. ఈ విషయంలో అతను విశాఖపట్నం నుండి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు బయలుదేరాడు. ఈలోగా, కాజీపేట జీఆర్పి పోలీసులు అతన్ని పట్టుకొని, ఈ రోజు ఖమ్మం జైలుకు తరలించటం జరిగింది, మరియు గంజాయి చాక్లెట్ల తయారీ కంపెనీ డైరెక్టర్ మీద కేసు నమోదు చేయడం జరిగింది. నింధితుల వివరాల నిందితుడు రమేష్ కుమార్ దాస్(38) తండ్రి బిద్యోధర్ దాస్ కహ్సోగోడియా గ్రామం ఖిలిపియాంఖా, కొర్రై, జాజ్‌పూర్, ఒడిషా రాష్ట్రం, ఎంఎం ఫార్మా కంపెనీ డైరెక్టర్ నెహ్రూ బాగ్, మగవర. స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు 90 గ్రాముల గంజాయి మరియు 400 గంజాయి చాక్లెట్లు మొత్తం 3.1 కేజీలు, విలువ 32,000/-. రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ చందన దీప్తి, ఐపీఎస్. సూచనల మేరకు గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో కాజీపేట, టి. కృపాకర్, కాజీపేట డిఎస్ఆర్పి, వి. నరేష్ కుమార్, ఐఆర్పి కాజీపేట లైన్, అధ్వర్యంలో కాజీపేట రైల్వే పోలీస్ ఎస్ఐతో పాటు కాజీపేట సిబ్బంది నిందితుడిని పట్టుకోవటం జరిగింది.




# ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు









**జాతీయ జెండాను ఎగురవేసిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**అలరింపజేసిన చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు**

**జై భీమ్ న్యూస్ వరంగల్**

వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ మైదానంలో శుక్రవారం 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలను ఉద్దేశిస్తూ జిల్లా ప్రగతి గురించి వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ శ్రీమతి గుండు సుధా రాణి, శాసనమండలి సభ్యులు బస్వారాజు సారయ్య, శాసనసభ్యులు కె ఆర్ నాగరాజ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్ లతో కలిసి స్వాతంత్ర సమరయోధులను సన్మానించారు. ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివ రాలు తెలియజేస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్ లను మంత్రి సందర్శించారు. ఈ వేడుకల్లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు బస్వారాజు సారయ్య, శాసనసభ్యులు కె ఆర్ నాగరాజ్, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వైసిపి శుభం, డిఆర్ ఓ విజయలక్ష్మి స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖ ల జిల్లా అధికారులు, సిబ్బంది స్వాతంత్ర సమరయోధులు ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మూడురోజులుగా ఘనంగా సాగుతున్న వికాస్ నగర్ బంజారా తీజ్ ఉత్సవాలు





**ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న గుగులోత్ వీరమ్మ గోపి సింగ్ నాయక్, వీ ఎన్ నాయక్, జాటోత్ కిషన్ నాయక్, పోరిక అర్పిత**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఈనెల 12 నుండి ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన బంజారా తీజ్ ఉత్సవాలు హన్మకొండ పట్టణంలోని వికాస్ నగర్ లో మూడు రోజులుగా ఘనంగా భక్తిశ్రద్ధలతో బంజారా బాలికలు ఆడపడుచులు వారి కుటుంబ సభ్యులు వందల సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను నిర్వహిస్తూ పట్టణంలో తమ ఐక్యతను ఉనికిని చాటుకుంటున్నారు. తమ సాంప్రదాయమైన ఆటపాటలతో సంస్కృతిగా కార్యక్రమాలకు సందడి చేస్తున్నారు. ఈనెల 21తో ముగియనున్న తేజు ఉత్సవాల సందర్భంగా మరింత శోభను తెచ్చే విధంగా ఈ ఉత్సవాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా వికాస్ నగర్ హనుమకొండలో నిర్వహిస్తున్న బంజారా తీజ్ ఉత్సవాలు పట్టణ ప్రజలను ఆకట్టుకుంటున్నాయి ఇతర కులాల వారు సైతం ఉత్సవాల్లో పాల్గొనడం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఈ ఉత్సవాలను గుగులోత్ వీరమ్మ గోపి సింగ్ నాయక్, వి ఎన్ నాయక్, జాటోత్ కిషన్ నాయక్, పోరిక అర్పిత, ధరంసోత్ అనసూయ, బానోతు సోనీ, వాంకుడోత్ వీరన్న నాయక్, బానోత్ వసంత నాయక్, లావుడియా రాజు నాయక్, సునావత్ జవహర్లాల్ నాయక్, గూగులోతు గోపి సింగ్ నాయక్, బానోతు వెంకన్న నాయక్, మూడు రమేష్ నాయక్, అజ్మీర వెంకట్ నాయక్, బానోత్ భాస్కర్ నాయక్, బుక్కా శ్రావణ్ నాయక్, జాటోత్ సమూలాల్ నాయక్, మరియు 20 మంది ఉత్సా కమిటీ టీం లీడర్లు పర్యవేక్షిస్తూ ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఆకర్షణగా నిలుస్తున్నారు.

# ఉత్తమ జిల్లా అధికారిగా అవార్డు అందుకున్న డిఎంహెచ్ఓ అప్పయ్య

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఉత్తమ జిల్లా అధికారిగా హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎ అప్పయ్యకి అవార్డును అందజేసిన మంత్రి కొండా సురేఖ, గౌరవ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్. జిల్లాలోని వైద్యాశాఖలో ప్రతినిత్యం నేనున్నానంటూ ఇటు సిబ్బందికి, అటు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందించి అందరి బండనూరు పొందిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ అప్పయ్య. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు వైద్యశాఖ అధికారులు శు భాకాంక్షలు తెలియజేశారు.



# ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా రూపొందడానికి చదువే మార్గం !

**ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెన్ట్ ప్రొఫెసర్ చంద్రమౌళి**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**







పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల,(అటామస్) హనుమకొండలో 79 వ,స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెన్ట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గాంధీజీ, నెహ్రూ, సుభాస్ చంద్రబోస్ మొదలైన మహనీయుల త్యాగఫలితంగా స్వాతంత్ర్యము సిద్ధించిందనీ, త్యాగధనుల, మహనీయుల, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మనం ఎప్పటికీ స్మరించుకోవాలని, మన భారత దేశం ప్రపంచంలో అగ్రగామిగా రూపొందడానికి చదువే మార్గం అన్నారు. విద్యార్థులు, ఎక్కువగా శ్రమించాలని కోరినారు, విద్యార్థులు చదువులో ఉన్నతులుగా ఎదుగుతూ కళాశాలకు,తమ ఊరికి , తమ కుటుంబానికి పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలని అన్నారు. నైపుణ్యం, టాలెంట్ ఉన్న ఇంజనీరింగ్, మెడికల్, సైంటిస్టల కు ఇండియాలోనే అవకాశాలు కలిపించాల్సిన అవసరం గవర్నమెంట్ పైన ఎంతైనా ఉంది. కళాశాలలో వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన అధ్యాపకులకు ఎక్సలెన్సీ అవార్డు సర్టిఫికెట్స్, విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులు అందించారు. కళాశాల కామర్స్ అధ్యాపకులు డా. జి.రాజుకు రీసర్చ్ ఇన్ ఎక్సలెన్స్ సర్టిఫికెట్, కళాశాల కెమిస్ట్రీ, వ్యాయామ విద్య అధ్యాపకురాలు జి.జ్యోతికి ఎక్సలెన్స్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్, బెస్ట్ ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లుగా టి.అనన్య (బి ఎస్సీ II), జి .జీవిత (బి కాం III/ జి.పూజ(బి.ఎస్సీ I, లకు బహుమతులను, బెస్ట్ ఎన్ సి సి క్యాడెట్ గా జి. వెంకటలక్ష్మి (బి ఎస్సీ, ఎం పిసి III,కి ప్రిన్సిపాల్ బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.జి.సుహాసిని, ఇక్యూ ఏ సి కోఆర్డినేట్ డా. డి.సురేశ్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం.అరుణ, కళాశాల ఎన్ సి సి ఆఫీసర్ డాక్టర్ సువర్ణ, ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్లు, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన లారీ



**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

రాయపర్తి మండలం మైలారం వద్ద శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది, వరంగల్ - ఖమ్మం రహదారిపై ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది, ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ నుంచి తొర్రూర్ వైపు వెళ్తున్న బస్సును కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదం కారణంగా సుమారు 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# జిల్లా కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ చేసిన డాక్టర్. సత్య శారదా



**జై భీమ్ న్యూస్ వరంగల్**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా శుక్రవారం జాతీయ పతాకావిష్కరణ గావించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బంది, విద్యార్థులకు కలెక్టర్ స్వాతంత్ర్య దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి,డిఆర్ ఓ విజయలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వ ప్రసాద్, విభాగాల పర్యవేక్షకులు, కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# భద్రకాళి ఆలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







**వరంగల్ జై భీమ్ న్యూస్**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా జెండావందన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఉదయం గం.ఐ 08-00లకు దేవాలయ చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, బింగి సతీష్, గాండ్ల స్రవంతి, మోతుకూరి మయూరి, జారతి వెంకటేశ్వర్లు, పాలడుగుల అంజనేయులు, అనంతుల శ్రీనివాస్, పార్నంది నర్సింహమూర్తి, ఈ.ఓ రామల సునీత, శ్రీ భద్రకాళి శేషు, దేవాలయ అర్చకులు సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనముకు భక్తులు దేవాలయమునకు పోటెత్తారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఓడిబియ్యం పోసి అమ్మవారికి చీరలు సమర్పించారు. శుక్రవారం ఉదయం దేవాలయమును నగర మేయర్ గుండు సుధారాణి, అమ్మవారికి ఓడిబియ్యం పోసి చీర సమర్పించారు. అనంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు. అనంతరం న్యూ ఢిల్లి నుండి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోస్ట్ శ్రీ జితేంద్ర గుప్తా, సి.పి.ఎం.జి తెలంగాణా పి.వి.ఎస్ రెడ్డిలు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. పూజానంతరం ఆలయ మహామండపంలో శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యవమున అర్చకులు, వేదవిద్యార్థులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు, చిత్రపటమును బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎస్.పి. శ్రీ రవికుమార్, హనుమకొండ ఎస్.పి హనుమంతు, సీతారాం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్టోరియాస్ అవార్డు అందుకున్న ఎంపీడీఓ గుండె బాబు



**హన్మకొండ జిల్లా(కమలాపూర్) జై భీమ్ న్యూస్**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గణతంత్ర వేడుకలలో కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు కలెక్టర్ స్నేహ శబరిష్ చేతుల మీదుగా మెరిట్టోరియాస్ అవార్డు అందుకున్నారు. కమలాపూర్ మండలంలో ప్రతిగ్రామాన్ని పరిశీలిస్తూ ఎలాంటి పరిష్కారమైన త్వరగా పరిష్కరించి గ్రామ గ్రామానికి సందర్శించి తమ విధులను సేవా, అంకితభావంతో పనిచేసి మండలానికి మంచి పేరు తీసుకొచ్చిన గుండె బాబును పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, మాజీ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## డా.పర్లపల్లి శ్రీశైలంకు జిల్లా అధ్యక్ష పదవి

**జై భీమ్ న్యూస్ హన్మకొండ**



తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆంధ్ర పాలకులకు వ్యతిరేకంగా కాకతీయ యూనివర్సిటీ వేదికగా శ్రీమతి కల్వకుంట్ల కవితక్క అండదండలతో ఎన్నో పోరాటాలు చేసి అనేకమైన కేసులు అయినప్పటికీ కూడా మడమ తిప్పకుండా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధనలో తన వంతు పాత్రను పోషిస్తూ అనేక ఉద్యమాలు చేసిన డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం కు ఈరోజు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత, గుర్తించి తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా నియామకం చేయడం చాలా ఆనందదాయకం. ఈ పదవి కోసం చాలామంది పోటీలో ఉన్నప్పటికీ కూడా ఒక నిజమైన, నికార్సాయిన ఉద్యమ కారుని గుర్తించి జిల్లా అధ్యక్ష తెలంగాణ జాగృతి పదవి ఇవ్వడం వల్ల జిల్లాలోని అనేకమంది హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం కవితక్క కి, నవీన్ ఆచారి కి, డాక్టర్ నలమాస శ్రీకాంత్ కి అలాగే హనుమకొండలోని జిల్లా ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంబాల జెడ్పిహెచ్ఎస్ లో ఘనంగా ఘనతంత్ర వేడుకలు

**ఆటపాటలతో అలరించిన విద్యార్థి విద్యార్థులు**





**హన్మకొండ జిల్లా (కమలాపూర్) జై భీమ్ న్యూస్**

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కమలాపూర్ మండలం అంబాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు రోజా రమణిలతో జాతీయ పతావిష్కరణ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ గణతంత్ర వేడుకలలో పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులంతా కలిసి ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సరస్వతి, నరసింహారెడ్డి, లక్ష్మి, ఎన్.ఎస్.యూ.ఐ నియోజకవర్గ అధ్యక్షులు బోయిని హనుమాన్ ప్రసాద్, కమలాపూర్ మత్స్యశాఖ మండల ప్రెసిడెంట్ అబ్బరవేణి అనిల్, దేశిని వీరయ్య గౌడ్, సందసాని లక్ష్మీనారాయణ, జనగాని వీరస్వామి గౌడ్, గోల్కొండ దిలీప్, కుమ్మరి నాగరాజు, మెట్టుపల్లి రమేష్, మాజీ ఎంపిటిసి రమేష్, అంగన్వాడి టీచర్ రజిత, విద్యార్థిని విద్యార్థులు మంత్రి అక్షిత, ఝాన్సీ, మీనా, నగేష్, అభి, రితిక, వైష్ణవి, ప్రణీత, వర్షశ్రీ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.




## అంచలంచలుగా ఎదిగి తెలంగాణ జాగృతి కి రాష్ట్ర అధికార ప్రతినిధి వరకు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్

**జై భీమ్ న్యూస్ హన్మకొండ**

సామాన్య మధ్యతరగతి బి.సి గౌడ సామాజిక వర్గం లో, నరసింహులపేట మండలం, కౌసల్యదేవి పల్లి మారు మూల పల్లెటూరు లో నలమాస అరుణ -యాకయ్య గౌడ్ లకు జన్మించారు, వృత్తి రీత్యా శ్రీకాంత్ గౌడ్,నాన్న గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న రీత్యా వారి అమ్మమ్మ, ఊరు అయినా ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామం లో, స్థిర నివాసం ఉంటున్నారు, శ్రీకాంత్ గౌడ్ చిన్న తనం నుండే నాయకత్వ లక్షణాలు పునికి పుచ్చుకున్నారు. 1996 లోనే వారి తల్లి గారు నాటి తెలుగుదేశం పార్టీ లో వార్డు మెంబెర్ గా గెలుపొందారు. చిన్న నాగారం,ఇనుగుర్తి లోని ప్రాధమిక పాఠశాల జడ్. పి. హెచ్. ఎస్ లో వారి ప్రాధమిక విద్యను అభ్యసించారు. తరువాత జమండ్లపల్లి విద్యభారతి గురుకులం లో హై స్కూల్ పూర్తి చేసుకొని మానుకోట లో ఇంటర్, డిగ్రీ చదివారు, తధనంతరం నెల్లికుదురు లో ఓ ప్రయివేట్ పాఠశాల లో రెండు సంవత్సరాలు తెలుగు, సోషల్ ఉపాధ్యాయుడిగా పని చేశారు. 2008లో కాకతీయ విశ్వద్యాలయంలో హిస్టరీ,టూరిజం డిపార్ట్మెంట్ లో పీజీ పూర్తి చేసుకున్నారు, పి.హెచ్. డి డాక్టరెట్ ఆదే డిపార్ట్మెంట్ లో డాక్టర్ టీ.దయాకర్ రావు పర్యవేక్షణ లో పూర్తి చేసుకున్నారు. టీ.ఆర్.ఎస్.ఫ్.కాకతీయ యూనివర్సిటీ ఉప అధ్యక్షులు గా, నియమించపడ్డారు, నాడు సీమాంధ్ర పాలకులు తెలంగాణ మీద వివక్షతను చూపెడుతున్నప్పుడు విద్యార్థి నాయకుడి గా ఎండగడుతూనే విద్య రంగ సమస్యలపైన ప్రభుత్వం తో పోరాడుతు వచ్చారు. గతం లో ఇంటర్, డిగ్రీ లో ఎస్.ఫ్.ఐ లాంటి వామపక్ష భావజాలం కలిగిన సంఘం లో పనిచేసారు. ఫ్రీ జోన్ గా తెలంగాణ ను నాటి సీమాంధ్రులు ప్రకటించినప్పుడు ఇక్కడి నిరుద్యోగ యువకులకు జరుగుతున్న అన్యాయాన్ని 14ఫ్ క్లాజ్ కి వ్యతిరేకం గా అనేక ఉద్యమలు చేపట్టి అనేక కేసులు నమోదు చేసుకున్నారు. తధనతారం తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిరి పడుతున్న సమయం లో కెసిఆర్, ఆమరణ దీక్షకు బయలు దేరినప్పుడు కాకతీయ యూనివర్సిటీ లో ఉద్యమన్ని ఉదృతం చేసి ఉద్యమ జ్వాలాల ను రగిలించారు. కే.యూ.టి.ఎస్.జే.ఏ. సి నిర్మాణం లో పునాది రాయి ల శ్రీకాంత్ గౌడ్ పని చేశారు, యూనివర్సిటీ ఎస్.డి.ఎల్. సి ఈ ప్రగానం లో 2009 లో తొలి సారి కెసిఆర్, దీక్ష కు సంఘీభావం గా ఆమరణ నిరాహార దీక్ష కు కూర్చున్న తొలి విద్యార్థి నాయకుడు డాక్టర్ నలమాస. చివరకు నాటి ప్రభుత్వం వీరి దీక్ష కు భంగం కలిగించి అర్ధ రాత్రి పోలీస్ బలగలతో దీక్ష శిభిరం పైన విరుచుక పడి అక్రమంగా అరెస్ట్ చేసి వరంగల్ సెంట్రల్ జైలు కు తరలిస్తే, జైలు గోడలాలో జై తెలంగాణ అనే నినాదాలు మర్మో గిస్తూ, దీక్ష ను కంటిన్యూ చేసారు, ఆరోగ్యం విషమిస్తున్న లెక్క చేయకుండా కొనసాగిస్తుంటే పోలీసులు ఎం.జి.ఎం కి తరలించారు, అక్కడ కూడా ట్రీట్మెంట్ కి సహకరించకుండా హాస్పిటల్ బెడ్ పైన కూడ దీక్ష ను కొనసాగించారు, చివరకు నాటి సీనియర్ నాయకులు విజయ రామారావు కెసిఆర్ తో మాట్లాడి, శ్రీకాంత్ గౌడ్ తో మాట్లాడించారు, కెసిఆర్ విజ్ఞప్తి తో నాడు ఆమరణ దీక్ష ను, నాటి వీ.సీ లింగమూర్తి చేతులు మీదుగా విరమించి అజెయంగా 11 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. విద్యార్థి రాజకీయాల్లో పోటీ తత్వాన్ని సైతం ఎదురకొంటూ అనేక పోరాటాలు తీసుకున్నారు, డీసీసీ భవన్ ముట్టడి, మంత్రుల ఇండ్లను ఘోరవ్ చేయడం, మిలియన్ మార్చ్, అసెంబ్లీ ముట్టడి, సడక్ బంద్, పాలకుర్తి చంద్ర దండు యాత్ర, మానుకోట రాళ్ళ దాడి, అనేక మిలిటెంట్ తరహా జరిగిన పోరాటల్లో శ్రీకాంత్ గౌడ్ నాయకత్వం వహించారు.. 2011 లో శ్రీమతి కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి ని విస్తరిస్తున్నప్పుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా లో మంచి నాయకుడి కోసం చూస్తున్నప్పుడు అప్పటికే పరిశోదక విద్యార్థిగా శ్రీకాంత్ గౌడ్ మంచి స్ట్రీమ్ లైన్ లో ఉన్నారు, అది గ్రహించిన కవిత శ్రీకాంత్ గౌడ్ ని పిలిపించుకున్నారు, జాగృతి తో పని చేయాలనీ సూచించటం తో తన అనుచరుల తో టి.ఎన్.జి.ఓ. ఎస్ భవన్ లో సదస్సు ఏర్పాటు చేసుకొని జాగృతి లో జాయిన్ అయ్యారు, తదనంతరం కవిత నాయకత్వం లో తెలంగాణ ప్రకటన వెనక్కి పోయిన రోజు ను నిరసనగా డిసెంబర్ 22, 2011 నా ఏకాశీల పార్క్ నందు పది వేల మంది తో భారీ విద్యార్థి పోరు సభను ఏర్పాటు చేసి 400 మీటర్ల నల్ల బ్యానర్ ని ప్రదర్శిస్తూ తొలి సారి కవిత గారిని ఘనంగా ఓరుగల్లు పోరుగడ్డ కు స్వాగతించారు, వరంగల్ గడ్డ మీద జాగృతి జెండాను ఎగరవేసి జాగృతి ని స్థాపించారు, శ్రీకాంత్ గౌడ్, తరువాత విద్యార్థి జిల్లా అధ్యక్షులు గా మూడు సంవత్సరాలు కొనసాగారు, ఎలాంటి ప్రభుత్వం కార్యక్రమం ఉన్న శ్రీకాంత్ గౌడ్ ముందస్తు అరెస్ట్ తప్పని సరి అనేంతగా శ్రీకాంత్ గౌడ్ ఉద్యమన్ని ప్రభావితం చేస్తొ పని చేశారు.. 2014 లో నెల్లికుదురు మండలం నుండి జడ్పీటీసీ గా నామినేషన్ వేశారు, ఆ సమాయం లోనే కవిత నిజామాబాద్ కు ఎం.పీ అభ్యర్థి గా అరగ్రేటం చేస్తున్న తరుణం లో కవిత గారి సూచన మేరకు జడ్పీ.టీ.సీ అభ్యర్థి గా ఉపసమహరించుకొని బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి గా కవిత నాటి వారి ఎన్నికలకు బాధ్యతలు అప్ప జెప్పినారు, సుమారు 100 మంది విద్యార్థి నాయకులతో బాల్కొండ లో ఎన్నికలను ప్రతిష్టత్మకంగా తీసుకొని గ్రామం గ్రామం కలియ తిరిగారు, నిజామాబాద్ పార్లమెంట్ సిగ్మెట్ లో ఉన్న 07 నియోజకవర్గం లలో ఎక్కడ రానంతగా కవిత కి 45000 లీడ్ వచ్చేలా శ్రీకాంత్ గౌడ్ పని చేసిన తీరు కవిత ని



అబ్బురపరిచింది. పార్లమెంట్ ఎన్నికల్లో కవిత గెలుపొందిన తరువాత శ్రీకాంత్ ని పిలిచి హైదరాబాద్ కి నివాసం మారాలని ఇక్కడి నుండి విద్యార్థి విభాగ రాష్ట్ర బాధ్యతలు చూడాలని కోరటం తో వారి మకాం హైదరాబాద్ కి మార్చుకొని తొలి సారి కాకతీయ విశ్వవిద్యాలయం నుండి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తెలంగాణ జాగృతి విద్యార్థి సమాఖ్య టీ.జె.ఎస్.ఫ ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఊర్రుతలు ఉగించారు, కొన్ని ప్రధాన పార్టీల సంఘాలను సైతం డామినేట్ చేసె అంతగా శ్రీకాంత్ గౌడ్ విద్యార్థి విభాగాన్ని ముందుకు తీసుకెళ్లారు.. నాడు శ్రీకాంత్ గౌడ్ కమిటీ లలో ఉన్న నాయకులు నేడు జిల్లా జాగృతి కి అధ్యక్షులు కాగాలిగారు అంటే అంతటి శక్తి వంత మైన నాయకత్వం ని శ్రీకాంత్ గౌడ్ తయారు చేశారు. తదనంతరం రాష్ట్ర కార్యదర్శి గా జాగృతి లో పని చేశారు, సంవత్సరా కాలం నిజామాబాద్ జాగృతి పార్లమెంట్ ఇంచార్జ్ గా పని చేశారు, 2014 తన సహచరి రీసెర్చ్ స్కాలర్, శ్వేతా ను పెద్ద ల సమక్షంలో లో ఆదర్శ వివాహం చేసుకున్నారు,కూతురు సుదీక్ష... ప్రస్తుతం ఉన్నా రాజకీయ పరిస్థితి దృష్టియా కవిత గారు తప్పుడు కేసులో జైల్ కి వెళ్లి వచ్చినంక, జరుగుతున్న పరిణామాల్లో ఆమెకు కష్ట కాలం లో సైతం వారిని విడువకుండా నమ్ముకున్న నాయకురాలి కి అండగా కవిత మాటనే శీరస వహిస్తూ బిసి సామాజిక వర్గం నుండి బలమైన నాయకుడిగా వారికీ తోడుగా నిలిచారు, ఎలాంటి విమర్శలు వచ్చిన, ఇటు టి.వి ఛానెల్స్ ద్వారా డిబేట్స్ చేస్తూ, తిప్పికొడుతూ కవిత కి అండగా నిలిచినా శ్రీకాంత్ గౌడ్ సేవలకు ప్రతిఫలం ఈరోజు రాష్ట్ర అధికార ప్రతినిధి గా తనను నియమించటం అని తెలంగాణ బిసి సమాజం, విద్యార్థి, యువజన లోకం భావిస్తున్నది... ఉమ్మడి వరంగల్ జిల్లా, మానుకోట జిల్లా, కాకతీయ యూనివర్సిటీల లో శ్రీకాంత్ గౌడ్ నియామకం తో జాగృతి క్యాడర్ లో కొత్త ఉత్సాహం వచ్చినట్టు అయ్యింది.

## ఆస్ట్రేలియాలో స్వాతంత్ర్య వేడుకలు

**అడ్డుకోబోయిన ఖలిస్తానీ అనుకూల వాదులు**

**న్యూఢిల్లీఆగస్ట్15(జై భీమ్ న్యూస్):**

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించుకున్నారు. ఆస్ట్రేలియా లోని కాన్సులేట్ కార్యాలయంలో కూడా వేడుకల నిర్వహణకు సిద్ధం కాగా.. అక్కడకు వచ్చిన ఖలిస్థానీయులు రెచ్చిపోయారు. మెల్‌బోర్న్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించేం దుకు భారతీయులు కాన్సులేట్ వద్ద హాజరయ్యారు. దేశభక్తి గీతాలు పాడుతుండగా.. కొందరు ఖలిస్థానీలు చొరబడ్డారు. అనంతరం తమ జెండాలు ఊపుతూ నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని.. ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇటీ-వల మెల్‌బోర్న్‌లోని ఓ హిందూ ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు విద్వేషపూరిత వ్యాఖ్యలు రాసిన సంగతి తెలిసిందే. ఆలయం గోడలపై హిట్లర్ చిత్రాన్ని ఉంచి, దానిపై 'గో హోమ్ బ్రౌన్..' అని రాశారు. అంతకుముందు కూడా కొందరు దుండగులు ఓ భారతీయ విద్యార్థిపై దాడి చేసి జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ భారతీయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ కాలంగా భారత్‌తో తమ స్నేహం కొనసాగుతోందని, న్యూఢిల్లీ విజయాన్ని తాము కూడా నిర్వహించుకుంటు-న్నామని చెప్పారు.

# అపోహలు, అనుమానాలతో ముందుకు వెళితే అభివృద్ధి సాధించలేం








**ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

అపోహలు, అనుమానాలతో ముందుకు వెళితే అభివృద్ధి సాధించలేమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న చిత్తశుద్ధి, పట్టుదల, ఓపిక, సహనం తనకున్నాయని, అందరం కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, "కొందరు కావాలని సృష్టించే అపోహలు, అనుమానాలకు మరింత ఊతమిస్తే అంతిమంగా వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుంది. ప్రజలకు ఉపయోగపడే విధంగా రియల్ ఎస్టేట్ రంగంలో సరైన ప్రణాళికలతో ముందుకొస్తే తప్పకుండా సహకరిస్తాం. దాన్ని ఒక చాలెంజ్‌గా తీసుకుంటాను. తెలంగాణలో పెట్టుబడుల కోసం అమెరికా, జపాన్, కొరియా, దుబాయ్ లాంటి దేశాల్లో రోడ్ షోలు నిర్వహిస్తూ, విదేశీ కంపెనీలను ఆహ్వానిస్తున్నప్పుడు, ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి ఈ నగరం కోసం, ఈ దేశ అభివృద్ధి కోసం పెట్టుబడులతో ముందుకొస్తే మిమ్మల్ని ఎందుకు వదులుకుంటాం. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడానికి హైదరాబాద్‌ను, తెలంగాణను ప్రపంచంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి మీకున్న ఆలోచనలను పంచుకోండి. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధిని ఫణంగా పెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకు ఒడిగట్టే ప్రశ్నే లేదు. అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ పాలసీ, మౌలిక సదుపాయాలు.. రెండూ ముఖ్యం. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు చేస్తుంది. ఆ నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. పైగా ప్రజలకు అందుబాటిలో ఉండాలి. అలా ఉన్నప్పుడే పెట్టుబడులు ఆకర్షించి అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్లగలం. మౌలిక సదుపాయాలు కల్పించకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఆరోజు జైపాల్ రెడ్డి మెట్రో రైలు తీసుకురాకపోయి ఉంటే ఈరోజు ఆ సేవలు ఉండేవా. అయితే గడిచిన కొన్నేళ్లుగా మెట్రో విస్తరణ చేపట్టకపోవడం వల్ల నష్టం జరిగింది. మెట్రోను విస్తరించి ఉంటే ఈ ట్రాఫిక్ జామ్ సమస్య కొంతైనా తీరేది. మల్టీ యుటిలిటీ ట్రాన్స్ పోర్టేషన్ ఎప్పుడూ జన సాంద్రత ఉన్న ప్రాంతాల్లో ఉండాలి. అందుకే మెట్రోను నాగోల్ నుంచి ఎల్బీనగర్ %-% చాంద్రాయగుట్ట మీదుగా శంషాబాద్ వరకు ప్రతిపాదించాం. మరోవైపు ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు, కూకట్‌పల్లి నుంచి పటాన్‌చెరు వరకు, హైటెక్ సిటీ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి నియోపోలిస్ వరకు విస్తరణ చేయాలని సంకల్పించాం. ఇండస్ట్రియల్ కారిడార్ అనుమతి ఇవ్వమని కోరాం. తొందరలోనే అనుమతులు రాబోతున్నాయి. ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాల్సింది ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వమే. గ్రాంట్లు, పథకాలు, నిధులు, అనుమతులు ఇవ్వాలంటే ఢిల్లీకే వెళ్లాలి. గత పదేళ్ల కాలంలో కంటోన్మెంట్ భూమి ఇంచు కూడా సాధించలేదు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం ఢిల్లీకి వెళ్లి అనుమతులు తెచ్చాం. కాళేశ్వరం ప్రాజెక్టుపై 1 లక్ష కోట్ల రూపాయల అప్పు చేశారు. అది కూడా 12 సంవత్సరాల కాలంలో తిరిగి చెల్లించేలా 11.50 శాతం వడ్డీకి అప్పు తెచ్చారు. అంత వడ్డీకి అప్పు చేస్తామా. అప్పు చెల్లిస్తూ ఇప్పటికే 3 సంవత్సరాలు అయిపోయింది. ఇప్పటికే ప్రభుత్వం 29 వేల కోట్ల రూపాయలు చెల్లించింది. ఈ విషయంలో ఢిల్లీకి వెళ్లి రుణాలను రీస్ట్రక్చర్ చేయమని కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే విజ్ఞప్తి చేశాం. మొదటి దశలో 26 వేల కోట్ల రూపాయల రుణాన్ని 35 సంవత్సరాలకు రీస్ట్రక్చర్ చేయడమే కాకుండా వడ్డీని 7.5 కు తగ్గించాం. ఇదే రకంగా 2 లక్షల కోట్ల రూపాయల రుణాలను రీస్ట్రక్చర్ చేయాలని అడుగుతున్నాం. అప్పులు నెత్తిమీద ఉంటే ఎవరైనా వ్యాపారంలో రాణించగలరా. మెట్రో విస్తరణ కావాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతులు కావాలి. చీటికి మాటికి ఢిల్లీ వెళుతున్నారని కొందరు రాద్ధాంతం చేస్తున్నారు. ఢిల్లీ వెళ్లకుండా అనుమతులు ఎలా వస్తాయి. పక్క రాష్ట్రాల్లో ఎన్నో విమానాశ్రయాలు ఉండగా, తెలంగాణలో ఒకే ఒక ఎయిర్‌పోర్టు ఉంది. తెలంగాణకు రెండో ఎయిర్‌పోర్టు అవసరం లేదా. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు రెండింటికీ అనుమతులు తెచ్చాం. పెట్టుబడుల గురించి అడిగినప్పుడు కనెక్టివిటీ గురించి అడుగుతున్నారు. ఎయిర్ పోర్ట్ వస్తే పరిశ్రమలు వస్తాయి. పరిశ్రమలొస్తే అభివృద్ధి సాధించగలం. 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డుతో పాటు రీజినల్ రింగ్ రైల్, డ్రైపోర్టు వంటివి కేంద్రాన్ని అడిగాం. ఓఆర్‌ఆర్‌కు రీజినల్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా 11 రేడియల్ రోడ్లకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. శాటిలైట్ సిటీలు నిర్మించాలన్న ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. విజన్ డాక్యుమెంట్ గమనిస్తే తెలంగాణ సమ్మిళిత అభివృద్ధిని చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణ అని మూడు ప్రాంతాలుగా రాష్ట్ర సమగ్ర స్వరూపం ఉంటుంది. కోర్ అర్బన్‌లో సర్వీస్ సెక్టర్, సెమీ అర్బన్‌లో ఇండస్ట్రియల్ సెక్టర్, రూరల్‌లో అగ్రికల్చర్ సెక్టర్ ఉంటుంది. ఇలా మూడు రకాలుగా ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తున్నప్పుడు మీ పెట్టుబడులకు ఆ రకంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. హైడ్రా తెచ్చినప్పుడు కూడా కొందరు అపోహలు సృష్టించి అపవాదు వేయడానికి ప్రయత్నించారు. చెరువులు, నాలాలను అక్రమణలను తొలగిస్తే నాకేమైనా సొంత లాభం ఉంటుందా. విజ్ఞతతో ఆలోచించండి. తెలంగాణ కోసం వేస్తున్న ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది మీరే. ఇంకా మెరుగ్గా చేయడానికి సలహాలుంటే ఇవ్వండి. హైదరాబాద్‌ను అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దుతా. భవిష్యత్తులో వందేళ్లు, వెయ్యేళ్లు చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేద్దాం అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## జడ్‌పిటిసి ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

**వైకాపాను దెబ్బ కొట్టాలనే కుట్రలకు తెర**

**వైకాపా నేత సజ్జల రామకృష్ణా రెడ్డి**

**అమరావతి,ఆగస్ట్15(జై భీమ్ న్యూస్):**



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఎగురవేశారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకష్ణారెడ్డి మాట్లాడుతూ.. చాలా రాజకీయ పార్టీల్లో జవాబుదారీతనం తగ్గుతోంది. జగన్ విలువలు విశ్వసనీయత కలిగిన వ్యక్తి. ప్రజల కోసం పరితపించే వ్యక్తి. కానీ, ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా ప్రజలను మోసం చేయటం కొన్ని పార్టీలకు అలవాటుగా మారింది. ఈవీఎంలతో మోసం చేసి గెలుపు సాధించారు. గత ఎన్నికల్లో 12.5 శాతం ఓట్లు ఎలా పెరిగాయో ఎవరూ సమాధానం చెప్పటం లేదు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో వ్యవస్థలను నిర్వీర్యం చేసారు. ఎన్నికల్లో జగన్ సంయమనంతో వ్యవహరించారు. ఎన్నికల వ్యవస్థ గుడ్డిగా వ్యవహరించింది. సీసీ పుటేజీ, వెబ్ కాస్టింగ్ ఇవ్వమంటే ఇవ్వలేదు. ఎన్నికలు పారదర్శకంగా జరిగితే ఎందుకు భయపడతారు.?. వీటన్నిటిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తాం. వ్యవస్థలు యాంత్రికంగా పనిచేస్తే ప్రజాస్వామ్యం ఏం అవుతుంది?. తటస్థంగా ఉండేవారు ఎవరైనా ఆ 15 గ్రామాలకు వెళ్లి విచారణ జరపాలి. ఓట్లు- వేస్తే వాళ్ల చేతి వేళ్లకు చుక్కలు ఉన్నాయో లేదో చూడాలి. దాన్ని బట్టే పోలింగ్ ఎలా జరిగిందో అర్థం చేసుకోవచ్చు స్వేచ్ఛ, స్వాతంత్య్రం నిలపడాలని కోరుకునే వారు ఎవరైనా రావొచ్చు. పులివెందుల చరిత్రలో వైసీపీ ఓడిపోలేదు. ఎన్నికలు శాంతి యుతంగా జరగాలని జగన్ మోహన్ రెడ్డి సూచించారు. మేము కూడా వారితో గొడవపడి ఉంటే ఎన్నికలు ఫలితం ఎలా ఉండేదో?. కానీ ప్రజల ప్రాణాలకు ప్రమాదం రాకూడదని భావించాం. పోలింగ్ బూతుల్లో వైసీపీ ఏజెంట్లు- లేకుండా పోలింగ్ నిర్వహించారు. పదిహేను పోలింగ్ బూతులకు రెండు వేల మంది పోలీసులను పెట్టారు. జడ్పీటీ-సీ ఎన్నికల అక్రమాలపై మా పోరాటం కొనసాగుతుంది. న్యాయ వ్యవస్థ రక్షిస్తుందని జగన్ నమ్ముతున్నారు. ఎవరు వచ్చినా మేము అక్కడ జరిగిన విషయాలను చూపిస్తాం. మన ప్రజా స్వామ్యాన్ని మనం రక్షించుకుందాం అని అన్నారు.

## రాహుల్‌కు కనీస అవగాహన లేదు

**ఓట్ల చోరీ జరిగితే బిజెపి సీట్లు ఎందుకు తగ్గుతాయి**

**ఇండియా కూటమి సీట్లు ఎలా పెరిగాయి**

**తెలంగాణ, కర్నాటకలో కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది**

**కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు**

**హైదరాబాద్,ఆగస్ట్15(జై భీమ్ న్యూస్):**

ఓట్ల చోరీకి, భాజపాకు ఏం సంబంధమని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తాము ఓట్ల చోరీ చేస్తే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచేదా అని నిలదీశారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలో భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా'ర్యాలీలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుతో కలిసి బండి సంజయ్ పాల్గొన్నారు. ఓట్ల చోరీ జరిగితే.. ఇండి కూటమికి 230 ఎంపీ సీట్లు- వచ్చేవా? భాజపాకు 240 ఎంపీ సీట్లు- మాత్రమే ఎందుకు వస్తాయన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. అందుకే కాంగ్రెస్ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారిందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో తిరంగా ర్యాలీలు ఘనంగా నిర్వహించారని మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖత్వంతో జెండాలు ఎగురవేయనీయ లేదని ఆయన మండిపడ్డారు. ప్రధాని మోదీ వచ్చిన తరువాత ప్రతి ఒక్కరూ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం ప్రధాని మోదీ ఆలోచన అని పేర్కొన్నారు. మోదీ పాలనకు ముందు పరిస్థితి.. ఆ తర్వాత ఏమిటనేది ప్రజలు చూస్తున్నారని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తున్నారంటూ ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. రెండు రాజ్యాంగాలు అవసరం లేదంటూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోరాటం చేశారని వివరించారు. ఓట్లు- గల్లంతు విషయంలో ఎన్నికల సంఘానికి, బీజేపీకి, ప్రధాని మోదీకి ఏం సంబంధమంటూ ఆయన ప్రశ్నించారు దీనిపై ఫిర్యాదు చేస్తే.. ఈసీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల సంఘాన్ని తాము మేనేజ్ చేసేలా ఉంటే 240 ఎంపీ సీట్లకు ఎందుకు పరిమితమవుతామంటూ ప్రతిపక్షాలను బండి సంజయ్ సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో ఒక్క ఇంట్లోనే 300 ఓట్లు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ వాళ్లు 60 ఏళ్ళు దేశాన్ని దోచుకున్నారని.. దీనిపై తాము మీరు రిగ్గింగ్ చేశారని ఎప్పుడైనా అన్నామా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వ్యవహారంతో కాంగ్రెస్ పార్టీ కుక్కలు చింపిన విస్తరి అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌లో మీ పార్టీని నమ్మరని.. అక్కడ గెలిచేది బీజేపీనే అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వానికి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇక మార్వాడీలు గో బ్యాక్ అనేది కొంతమంది కమ్యునిస్టులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలతో కలిసి నేతలు ఆడుతున్న నాటకమని ఆయన అభివర్ణించారు. గుజరాతీలు, మార్వాడీలు సంపద దోచుకునేందుకు రాలేదన్నారు. వారు వ్యాపారాలు చేసుకుని రాష్ట్ర సంపదను పెంచేందుకు వస్తున్నారని వివరించారు. దమ్ముంటే నగరంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాల గురించి మాట్లాడాలంటూ రాజకీయ పార్టీలకు ఆయన సవాల్ విసిరారు. వాళ్ళ వల్లే బాంబు పేలుళ్లు జరుగు తున్నాయని ఆరోపించారు. మైనారిటీ-లు.. అన్ని వృత్తులలోని బీసీల పొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్వాడీలు ఎవరి ఉత్పత్తులు దోచుకోవడం లేదని పేర్కొన్నారు. ఇది ఒక కుట్ర అని ఆయన అన్నారు. హిందూ సమాజం జాగృతం అవుతుందని.. ఆ క్రమంలో రోహింగ్యాలు గో బ్యాక్ అని తాము అంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## రాబోయే రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**జై భీమ్ న్యూస్, వరంగల్**

కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి వర్షాల వల్ల నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పలు పథకాల క్రింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17, 18 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున,వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ప్రమాదకర పరిస్థితులు లేనప్పటికిని , వాగులు, వంకలు ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా రోడ్డు మార్గాలను డైవర్ట్ చేయాలన్నారు. ఇందుకు గాను పోలీసు, గ్రామ కార్యదర్శుల సహకారం తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా శిథిలావస్థలో ఉన్న గృహాలు, పాఠశాలలను గుర్తించి అందులో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. "తీవ్ర వర్షాల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. లోతట్టు ప్ర్రాంతాల్లో జలమయం కు ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని. డ్రైనేజీ వ్యవస్థ మరమ్మత్తులు, వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. "ప్రత్యేకంగా డ్యామ్‌లు, చెరువుల స్థితిగతులు నిరంతరం పరిశీలించాలని, ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కొన్ని ప్రాంతాలలో వర్షాల వల్ల తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈనెల 17, 18 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, మండల స్థాయి టీంలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అధికారులు సెలవులో వెళ్లకుండా హెడ్ క్వార్టర్స్ లోనే ఉంటూ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వర్షాల వల్ల నీరు కలుషితమై దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధుల పట్ల జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈలు శంకర్ , సునీత, జిల్లా ఆర్ అండ్ బి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన , జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారరాణి, తహసీల్దార్లు వివిధ శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న వరకాంతం జంగారెడ్డి



**చౌటుప్పల్, జై భీమ్ న్యూస్**

చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగవరం గ్రామంలో 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గ్రామంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీ ఆది మహావిష్ణు దేవాలయ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి పాల్గొని మాట్లాడుతూ చదువుతూనే అన్ని సాధించవచ్చునని ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించాలని ఆయన కోరారు చదువు భవిష్యత్తును మారుస్తుందని చదువు అనే ఆయుధం ప్రతి ఒక్కరి చేతిలో ఉంటే వారి జీవితం అన్ని రకాలుగా బాగుంటుందని తెలియజేశారు గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాల్గొని గ్రామాన్ని మరియు పాఠశాలను కన్నతల్లి చూసుకోవాలని ఆయన కోరారు.ఈ యొక్క కార్యరామములో చౌటుప్పల్ ఎంఈవో ఈ గురువారావు హెడ్మాస్టర్ కోమటిరెడ్డి నరసింహా రెడ్డి,అత్తాపురం వెంకట్ రెడ్డి, బొంగు సాయి,అజరత్ శివ మురళి నాగరాజు రామాచారి యాసిన్ రాములు టీచర్స్ ఉస్మాన్ అంజయ్య గ్రామ ప్రజలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఆశా వర్కర్ మైముద

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని పోలీస్ పారేడ్ గ్రౌండ్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్,డీఎంహెచ్ వో అప్పయ్య ల చేతుల మీదగా బెస్ట్ ఆశా వర్కర్ గా ఎండీ మైముదకు ప్రశంస పత్రాన్ని అందచేశారు.ఆమె వృత్తి ధర్మంలో భాగంగా అందించిన సేవలను గుర్తించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆశా వర్కర్ మైముద మాట్లాడుతూ తన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేసే ప్రజలకు ఉత్తమ సేవలందిస్తానని చెప్పారు.



జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem




# కూలీకి మిశ్రమ స్పందన

**లోకేశ్ తదుపరి ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం**

రజినీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ కూలీ, భారీ అంచనాల మధ్య ఆగస్టు 14న రిలీజ్ కాగా, ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. క్రిటిక్స్, ఆడియన్స్ అభిప్రాయం ప్రకారం, 'లియో' కంటే కూడా వీక్ మూవీగా 'కూలీ' నిలిచింది. సినిమాకు సంబంధించిన కథ, స్క్రీన్‌ప్లే, ఎమోషనల్ కంటెంట్ లోపించడం వల్ల సినిమాలో లోకేశ్ మార్క్ కనిపించలేదని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 'కూలీ' చూసిన అనేక మంది అభిమానులు, నెటిజన్లు ఇది నిజంగానే లోకేశ్ కనగరాజే దర్శకత్వం వహించిన సినిమానా? అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వరుస హిట్లతో దూసుకెళ్లిన లోకేశ్‌కు, ఈ సినిమా మొదటి పెద్ద ఫ్లాప్ అయ్యిందని అనలిస్టులు పేర్కొంటున్నారు. కూలీ' విడుదలకు ముందు ప్రభాస్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోలు లోకేశ్ కనగరాజ్‌తో సినిమా చేయాలనే ఆసక్తి చూపించారు. ప్రభాస్‌తో 'ఖైదీ 2' తర్వాత సినిమా ఉంటుందని జోరుగా ప్రచారం జరిగింది. అలాగే, 'పెద్ది' తర్వాత రామ్ చరణ్ కూడా లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ లో ఓ సినిమా చేయనున్నట్టు- టాక్ వినిపించింది. కానీ 'కూలీ' ఫలితం వెలుగు చూడగానే ఈ ప్రాజెక్టులపై సస్పెన్స్ నెలకొంది. ఫామ్‌లో లేని దర్శకుడితో సినిమాలు చేసి రిస్క్ చేయకూడదనే ఆలోచనతో ఇద్దరూ వెనకడుగు వేసినట్టు ఇండస్ట్రీ టాక్. ఫలితాలతో సంబంధం లేకుండా లోకేశ్ కనగరాజ్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ 'ఖైదీ 2' ను త్వరలో సెట్స్ పైకి తీసుకెళ్లనున్నాడు. కార్తీ హీరోగా రూపొందే ఈ సీక్వెల్‌పై మంచి అంచనాలున్నాయి. కానీ 'కూలీ' ఫలితంతో అది ఎలా రూపుదిద్దుకుంటుందో చూడాలి.



# బిపాసాపై గతంలో చేసిన వ్యాఖ్యలు వైరల్

**క్షమాపణలు చెప్పిన మృణాల్ ఠాకూర్**

మృణాల్ ఠాకూర్ ఈ మధ్య వరుస కాంట్రవర్సీల్లో ఇరుక్కుంటోంది. మొన్ననే ధనుష్ తో డేటింగ్ అంటూ వార్తల్లోకి ఎక్కింది. అది నిజం కాదంటూ ఎట్టకేలకు క్లారిటీ- ఇచ్చింది. ఇప్పుడు ఆమె పాత వీడియోపై తెగ కాంట్రవర్సీ నడుస్తోంది. దానిపై తాజాగా క్షమాపణలు చెప్పింది. గతంలో బిపాసా బసు మీద చేసిన పాత వీడియో వైరల్ కావడంతో మృణాల్ పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దాంతో ఇన్ స్టాలో పోస్టు పెట్టింది మృణాల్. తాను 19 ఏళ్ల వయసులో అలా మాట్లాడానని.. అప్పుడు తెలివి తక్కువగా మాట్లాడినట్టు- ఒప్పుకుంది. అప్పుడు నాకు పెద్దగా తెలియదు. అసలైన అందం అంటే ఏంటో ఇప్పుడే నాకు తెలుస్తోంది. అది చాలా విలువైంది. మనసుతో చూసే దాంట్లోనే అందం ఉంటుంది. కంటితో కాదు. అప్పుడు తప్పుగా మాట్లాడాను అని నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. అది ఇంత పెద్ద ఇష్యూ అవుతుందని అనుకోలేదు అంటూ క్షమాపణలు చెప్పింది మృణాల్. అసలు విషయం ఏంటంటే.. మృణాల్ 19 ఏళ్ల వయసులో ఓ ఇంటర్వ్యూలో బిపాసా బసుపై సె-టైర్లు వేసింది. బిపాసా బసు కంటే తానే అందంగా ఉంటానని చెప్పింది. బిపాసా కండలు తిరిగిన మగవారిలాగా ఉంటు-ందని.. ఆమె కంటే తాను బెటర్ అంటూ చెప్పింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. బాలీవుడ్ సెలబ్రిటీ-లు మృణాల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిపాసా కూడా ఫైర్ అయింది. దెబ్బకు మృణాల్ దిగొచ్చి సారీ చెప్పింది.

# కూలీని డామినేట్ చేస్తున్న వార్ 2

రెండు బిగెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాలైన వార 2, కూలీ సినిమాలు భారీ అంచనాలు మధ్య థియేటర్స్ లో అడుగుపెట్టాయి. కానీ రెండు ఒక రకమైన టాక్ తెచుకున్నాయి. రెండు సినిమాలలో కథ, కథనాలు ఆశించిన మేర లేవు. కూలీ ప్యూర్ మాస్ యాక్షన్ సినిమాగా తెరకెక్కగా వార్ 2 స్పై యాక్షన్ సినిమాగా తెరకెక్కింది. అయితే ఈ రెండు సినిమాలకు నెగిటివ్ టాక్ అంతగా పనిచేయలేదని చెప్పాలి. ఉదయం ఆటలు నెగిటివ్ టాక్ తెచ్చుకున్నా కూడా ఫస్ట్, సెకండ్ షోలు హౌస్ ఫుల్ బోర్డ్స్ పెట్టాయి రెండు సినిమాలు. తోలి రోజు సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన కూలీ డామినేషన్ చూపించింది. బుక్ మై షో లో గంటకు 34 వేల టికెట్స్ తో దూసుకెళ్ళింది. అలాగే వార్ 2 కు 32 వేలకు పైగా బుకింగ్స్ తో జోరు చూపించింది. అయితే సెకండ్ షోస్ నుండి వార్ 2 లీడ్ తీసుకుంది. నేడు రెండవ రోజు వార్ 2 గంటకు 62.44 వేల టికెట్స్ తో సెన్సేషన్ క్రియేట్ చేసింది. కూలీ 39.47 వేల బుకింగ్స్ తో డే 2 ని సాలిడ్ గా స్టార్ట్ చేసింది. మొదటి రోజు ఎన్టీఆర్ సినిమాను రజిని సినిమా డామినేట్ చేయగా రెండవ రోజు రజనీ సినిమాను ఎన్టీఆర్ సినిమా పూర్తిగా డామినేట్ చేసింది. అయితే మేజర్ కాంట్రిబ్యూషన్ హిందీ లాంగ్వేజ్ నుండి ఉండడం గమనార్హం. నేడు ఇండిపెండ్స్ డే పబ్లిక్ హాలిడే కావడంతో రెండు సినిమాలను చూసేందుకు ఆడియెన్స్ థియేటర్స్ కు క్యూ కడుతున్నారు. రాబోయే రెండు రోజులు కూడా వీకెండ్ కావడం రెండు సినిమాలకు కాస్త అడ్వాంటేజ్.




# హరిహర వీరమల్లుకు నష్టాల దెబ్బ

**జిఎస్టీ కోసం బయ్యర్ల ఆందోళన**

పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన హరిహర వీరమల్లు చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌ను అందుకున్న విషయం తెలిసిందే. రూ.250 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి దాదాపు రూ.100 కోట్ల నష్టం వచ్చినట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాకు వచ్చిన నష్టాలను పక్కనబెడితే ఈ మూవీ ఇంకా బ్రేక్ ఈవెన్ కాలేకపోయింది అనే విషయం ప్రస్తుతం బయ్యర్లలో ఆందోళన కలిగిస్తుంది. దీంతో ఈ సినిమా బ్రేక్-ఈవెన్ అవ్వకపోతే, జీఎస్టీని ఎవరు భరిస్తారు అనే చర్చ ఇప్పుడు టాలీవుడ్‌లో మొదలైంది. విడుదలకు ముందు రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి హరిహర వీరమల్లు దాదాపు రూ. 100 కోట్ల బిజినెస్‌ని జరిపినట్లు- సమాచారం. అయితే ఈ రూ.100 కోట్లకి జీఎస్టీ కింద సుమారు రూ. 18 కోట్లు- చెల్లించాల్సి ఉంటుంది. సినిమా విడుదలై హిట్ అయితే పెద్దగా ఈ విషయాన్ని ఎవరు పట్టించుకోరు. కానీ ఫ్లాప్ అయితే బయ్యర్లతో పాటు- నిర్మాతలలో కూడా ఈ విషయంపై ఆందోళన ఉంటుంది. ఇక ట్రేడ్ వర్గాల ప్రకారం.. సినిమా బ్రేక్-ఈవెన్ అవ్వకపోతే, జీఎస్టీని నిర్మాతే భరించాల్సి ఉంటుంది. దీంతో ఈ విషయంపై బయ్యర్లు నిర్మాతలు కలవడానికి ప్రయత్నిస్తున్నట్లు- తెలుస్తుంది. ఈ సినిమా విడుదలకు ముందు కూడా ఎటు-వంటి బజ్ లేకపోవడంతో పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ప్రమోషన్స్‌లో పాల్గోనమే కాకుండా ఇచ్చిన రెమ్యూనరేషన్‌లో కొంచెం వెనక్కి ఇచ్చినట్లు- వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయినా కూడా ఈ సినిమా అనుకున్న స్థాయిలో వసూళ్లను రాబట్టలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జీఎస్టీ భారం కూడా నిర్మాతపై పడితే అది ఇంకా కష్టంగా మారే అవకాశం ఉన్నట్లు- తెలుస్తుంది. ఇప్పటికే హరిహర వీరమల్లు డిజాస్టర్‌తో సగం కుంగిపోయిన నిర్మాత రత్నం జీఎస్టీ విషయంలో ఎలా స్పందిస్తాడు అనేది ఆసక్తికరంగా మారింది.

